నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644

**నీలగిరి నిత్యపద్యం**
పొడుపు పద్యం
ఆటవెలది

జీవితానుగాడు జీవరాశులంబట్టు
నడిచిపోదు దాని నరుడు మోయు
కాయమంత కనులు కాడుదేవేంద్రుడు
తెలుసుకున్నవారు తెలివిపరులు
(జవాబు :-వల)

మీ
విజయప్రసాద్ నలుమాసు

**విలేకరులు కావలెను**
తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 219 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 20-11 -2025 పేజీలు -8 | వెల: రూ. 5.00

# అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు



- ఆయన భౌతికంగా లేకున్నా మనతోనే ఉన్నారు
- ఆయన అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచాయి
- సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో ప్రధాని మోడీ

పుట్టపర్తి,
సత్యసాయి జయంత్యుత్సవాల్లో పాల్గొనడం తన అదృష్టమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పుట్టపర్తిలో నిర్వహించిన సత్యసాయి శత జయంత్యుత్సవాలకు ఆయన హాజరై మాట్లాడారు. విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి జీవించారు. భౌతికంగా బాబా లేకున్నా... ఆయన ప్రేమ మనతోనే ఉంది. సత్యసాయి బోధనల ప్రభావం దేశమంతా కనిపిస్తోంది. కోట్ల మంది ఆయన భక్తులు మానవ సేవ చేస్తున్నారు. సత్యసాయి ప్రేమ సూత్రాలు ఎందరినో-మిగతా 2 లో



## హిందూ మహిళలు మేల్కోవాలి

- ఆస్తులుంటే వీలునామా రాయండి
- ఆస్తి విషయమై మహిళ పుట్టింటి వాళ్లకు, అత్తింటి వారికి మధ్య వివాదాలు చెలరేగుతున్నాయి
- సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు

2 లో



## ఐ బొమ్మ రవికి పోలీస్ కస్టడీ

- ఐదురోజుల కస్టడీకి కోర్టు అనుమతి
- పైరసీ మాఫియాకు సంబంధించిన వివరాలు రాబట్టే పనిలో పోలీసులు
- కస్టడీ విచారణలో మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం

హైదరాబాద్
పైరసీ సైట్ 'ఐబొమ్మ' నిర్వాహకుడు రవి అరెస్టైన తరవాత పోలీసులు కస్టడీ కోరారు. ఈ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రధాన నిందితుడు రవి కస్టడీకి అనుమతిస్తూ హైదరాబాద్ నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఐదు రోజుల కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రేపటి నుంచి ఐబొమ్మ రవిని కస్టడీలోకి తీసుకుని పోలీసులు ప్రశ్నించనున్నారు. పైరసీ మాఫియాకు సంబంధించిన వివరాలు రాబట్టే పనిలో పోలీసులు ఉన్నారు.వారం రోజుల పాటు ఇమంది రవిని కస్టడీకి ఇవ్వాలని నాంపల్లి కోర్టులో సైబర్ క్రైమ్ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు.
-మిగతా 2 లో

# పాలనలో ఇందిరాగాంధీ ఓ రోల్‌మోడల్

### ఆమె స్ఫూర్తితో ముందుకు సాగుతున్నాం

## కోటి మంది మహిళలకు కోటి చీరలు పంపిణీ చేస్తాం

- ఇందిరకు ఘనంగా నివాళి అర్పించిన సీఎం
- డిసెంబర్ 9 వరకు ఇంటింటికీ చీరల పంపిణీ
- మార్చి ఫస్ట్ నుంచి 8 వరకు రెండో విడతలో చీరల పంపిణి
- ఇందిరాగాంధీ పాలన దేశానికి దిక్సూచి
- వెయ్యి ఆర్టీసీ బస్సులకు మహిళలను ఓనర్లను చేశాం
- జయంతి వేడుకల సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ



హైదరాబాద్, -నవంబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)
పరిపాలనలో ఇందిరా గాంధీ ఒక రోల్ మోడల్ అని సిఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. బలహీన వర్గాలకు ఇందిరమ్మ పాలన సువర్ణ అధ్యాయమని సీఎం రేవంత్ చెప్పారు. భూ సంస్కరణలతో పేదలకు భూ పంపిణీ చేశారని గుర్తుచేశారు. పాకిస్తాన్‌ను విడగొట్టి బంగ్లాదేశ్‌ను ఏర్పాటు చేశారని, ప్రపంచ దేశాల బెదిరింపులకు ఇందిరమ్మ భయపడలేదని సీఎం రేవంత్ తెలిపారు. మాజీ ప్రధాని, దివంగత ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా.. నెక్లెస్ రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహానికి -మిగతా 2 లో



## భారత్‌లో భారీ దాడులకు జైషే ప్లాన్..

- భారత్ వ్యాప్తంగా భారీ దాడులకు చేసేందుకు కుట్ర
- ఫిదాయిన్ కోసం ఆన్‌లైన్‌లో విరాళాల సేకరణ
- ఒక్కొక్కరి నుంచి 20వేల పాకిస్థాన్ రూపాయలు అంటే భారత కరెన్సీలో రూ.6,400 విరాళంగా సేకరణ
- గుర్తించిన భారత నిఘా వర్గాలు

న్యూఢిల్లీ నవంబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)
ఢిల్లీలో పేలుడు ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ ఘటనపై దర్యాప్తు చేసేకొద్దీ సంచలన విషయాలు వెలుగుచూస్తున్నాయి. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ భారత్ వ్యాప్తంగా భారీ దాడులకు కుట్ర చేసినట్లు నిఘా వర్గాలు తాజాగా గుర్తించాయి. ఇందుకోసం ఫిదాయిన్ (ఆత్మాహుతి దళం)ను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఈ దాడుల-మిగతా 2 లో



## మారేడిమిల్లిలో మరో భారీ ఎన్‌కౌంటర్

- ఏడుగురు మావోయిస్టు కీలక నేతలు హతం
- టెక్ శంకర్,నంబాల తదితరులు ఉన్నట్లు సమాచారం

న్యూఢీల్లీ,
ఆంధ్రప్రదేశ్ ఏజెన్సీలోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య భీకరమైన ఎదురుకాల్పులు చోటు చేసుకుంది. ఈ ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు ఏపీ ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేశ్ చంద్ర లడ్డా ధృవీకరించారు. ఈ ఏడుగురిలో ముగ్గురు మహిళా మావోయిస్టులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇవాళ జరిగిన ఎదురుకాల్పుల్లో చనిపోయిన వారంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని సమాచారం.మృతులను మావోయిస్టులు జోగారావు అలియాస్ టెక్ శంకర్, సీత అలియాస్ జ్యోతి, సురేశ్, గణేశ్, వాసు, అనిత, షమ్మిగా పోలీసులు గుర్తించారు. మరోవైపు మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో పోలీసుల కూంబింగ్ కొనసాగుతోంది. మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. నిన్న పట్టుబడ్డ 50 మంది మావోయిస్టులను విజయవాడలో మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మహేశ్ చంద్ర లడ్డా మీడియాతో మాట్లాడారు. మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్, తెలంగాణ నుంచి ఏపీకి రావడానికి మావోయిస్టులు ప్రయత్నిస్తున్నారు. నిఘా వర్గాల సమాచారం -మిగతా 2 లో

## తెలంగాణలో పంచాయితీ ఎన్నికలపై కసరత్తు

- నేటినుంచి 23 వరకు ఓటర్ల జాబితా సవరణలు
- ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశాలు జారీ

హైదరాబాద్,
తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఇటీవల కేబినేట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. డిసెబర్‌లో ఎన్నికల నిర్వహణ ఉంటుందని ప్రభుత్వం వెల్లడించింది. ఈ క్రమంలో కసరత్తు మొదలయ్యింది. ఇందులో భాగంగా పంచాయతీల్లో ఓటరు జాబితా -మిగతా 2 లో



## నేడు బీహార్ సీఎంగా మరోమారు నితీశ్ ప్రమాణం

- పదోసారి ప్రమాణం చేయబోతున్న నితీశ్
- ఎన్‌డిఎ నేతగా ఏకగ్రీవంగా ఎంపిక..గవర్నర్‌కు రాజీనామా
- నేటి ప్రమాణోత్సవానికి మోడీ, అమిత్ షా తదితరుల హాజరు



పాట్నా,
బిహార్‌లో నితీశ్ కుమార్ సారథ్యంలో ఎన్డీయే కొత్త ప్రభుత్వం గురువారం కొలువు తీరనుంది. బిహార్ ప్రస్తుత అసెంబ్లీ గడువు ముగియనుండటంతో ముఖ్యమంత్రి పదవికి నితీశ్ కుమార్ బుధవారం సాయంత్రం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌ను సమర్పించారు. ఎన్డీయే సభ్యుల మద్దతు లేఖను గవర్నర్‌కు అందజేశారు. ప్రభుత్వ ఏర్పాటుకు తమను ఆహ్వానించాలని గవర్నర్‌ను కోరారు. ఇందుకు గవర్నర్ సానుకూలంగా స్పందించారు. నితీశ్ రాజీనామాను వెంటనే ఆమోదించారు. నితీశ్ వెంట గవర్నర్‌ను కలిసి వారిలో ఎల్‌జేపీఆర్‌వీ చీఫ్ చిరాగ్ పాశ్వాన్, ఆర్‌ఎల్‌ఎం చీఫ్ ఉపేంద్ర కుష్వాహ తదితరులు ఉన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు దిశగా బుధవారం ఉదయం నుంచి పాట్నాలో వేగంగా పరిణామాలు చోటుచేసుకున్నాయి. జేడీయూ ఎమ్మెల్యేలు సమావేశమై పార్టీ -మిగతా 2 లో

## పార్టీలో ఉంటునే సొంతవారిపై పోస్టులు

- ఇలాంటి వారిని ఉపేక్షించేది లేదు
- కార్యకర్తలకు బీజేపీ చీఫ్ రామ్ హెచ్చరిక



హైదరాబాద్-
నవంబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)
పార్టీ కార్యకర్తలకు తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు వార్నింగ్ ఇచ్చారు. పార్టీ కార్యకర్తలు ఎవరైనా సరే ఇష్టమొచ్చినట్లు కామెంట్ చేస్తే సస్పెండ్ చేస్తాం అని హెచ్చరించారు. టైమ్ కూడా ఇవ్వం అని, అవసరం అయితే జైలుకు పంపిస్తాం అని కార్యకర్తలతో అన్నారు. కొందరు తాము బీజేపీ అంటూనే.. బీజేపీ నేతల మీదనే పోస్టింగ్‌లు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిత్వంను అస్సలు చంపుకోవద్దని సోషల్ మీడియా, యూట్యూబ్ వారికి రామచందర్ రావు విజ్ఞప్తి చేశారు. బీజేపీ సోషల్ మీడియా, లీగల్ సెల్ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడారు.
-మిగతా 2 లో

# జూబ్లీహిల్స్‌లో దొంగ ఓట్లతో గెలుపు

- ఎలా గెలిచారో రేవంత్‌కు తెలియదా
- బీఆర్ఎస్‌కు భయపడి అజారుద్దీన్‌కు మంత్రి పదవి
- జూబ్లీహిల్స్ నాయకులతో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్,నవంబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)
జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎలా గెలిచిందో రేవంత్‌రెడ్డి అంతరాత్మకు తెలుసునని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. కర్నాటక నుంచి మనుషులను తీసుకువచ్చి దొంగ ఓట్లు వేయించారన్నారు. షేక్‌పేట, ఎర్రగడ్డలో రిగ్గింగ్‌కు పాల్పడ్డారన్నారు. రాయించి, వేయించుకున్న ఓట్లతో జూబ్లీహిల్స్‌లో గెలిచారన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించారు.
-మిగతా 2 లో

## ఉమర్‌ది ముమ్మాటికీ ఉగ్రవాదమే

- ఇస్లాంలో బలిదానాన్ని తావులేదు
- ఎక్స్ వేదికగా తీవ్రంగా ఖండించిన ఓవైసీ



హైదరాబాద్, నవంబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)
ఎర్రకోటవద్ద ఆత్మాహుతి దాడికి పాల్పడిన డాక్టర్ ఉమర్ నబీకి చెందిన వీడియో ఒకటి వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. అందులో అతడు ఆత్మాహుతి దాడిని సమర్థిస్తూ మాట్లాడాడు. వాస్తవానికి అదొక బలిదాన ఆపరేషన్‌గా అతడు అభివర్ణించారు. అయితే, ఆత్మాహుతి దాడి గురించి ఉమర్ చేసిన వ్యాఖ్యలను ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా ఖండించారు. ఇస్లాంలో ఆత్మహత్య, -మిగతా 2 లో

# అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు

(మొదటి తరువాయి)

ఆలోచింపజేశాయన్నారు. బాబా బోధనలు లక్షల మందికి మార్గం చూపాయి. 'అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు'.. ఇదే ఆయన నినాదం. చాలా మంది జీవితాలను సత్యసాయి సమూలంగా మార్చేశారు. లక్షల మందిని సేవామార్గంలో నడిపించారు. ప్రజల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. తాగునీరు, వైద్యం, విద్య వంటి రంగాల్లో విశిష్ట సేవలు అందించారు. పుట్టపర్తి పవిత్ర భూమిలో ఏదో మహత్తు ఉంది. సత్యసాయి సంస్థలన్నీ ఇలాగే ప్రేమను పంచుతూ వర్ధిల్లాలని మోదీ అన్నారు. అంతకు ముందు సత్యసాయి జీవితం, బోధనలు, సేవల స్మారకార్థంగా రూపొందించిన రూ.100 నాణెం, 4 తపాలా బిళ్లలను ప్రధాని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్,నటి ఐశ్వర్యారాయ్ తదితరులు పాల్గొన్నారు. పుట్టపర్తికి రావడం ఎంతో సంతోషంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. సత్యసాయి జయంతి వేడుకల్లో పాల్గొంటూ తన అదృష్టమని పేర్కొన్నారు. సత్యసాయి బాబా బోధనలు ఎంతోమందికి మార్గం చూపాయని కొనియాడారు.ప్రేమ, శాంతితో కూడిన వసుదైక కుటుంబ భావన సత్యసాయిదని తెలిపారు. విశ్వశాంతి, విశ్వసేవను బాబా మనకు చాటి చెప్పారని అన్నారు. మానవ జీవితంలో సేవ చాలా ముఖ్యమని సత్యసాయి చెప్పారని గుర్తుచేశారు. అందరినీ ప్రేమించాలి.. అందరికీ సేవ చేయాలి.. ఇదే బాబా నినాదమని వివరించారు. గుజరాత్ భూకంపం వచ్చినప్పుడు బాబా సేవాదళ్ సేవలందించిందని గుర్తుచేశారు. పేదలకు ఎప్పుడు ఆపద వచ్చినా.. బాబా సేవాదళ్ ఆదుకుంటుందని ప్రశంసించారు. తాగునీరు, వైద్యం, విద్య వంటి రంగాల్లో విశిష్ట సేవలందించారనిపేర్కొన్నారు.

# భారత్‌లో భారీ దాడులకు జైషే ప్లాన్..

(మొదటి తరువాయి)

కోసం జైషే సంస్థ నిధులను కూడా సమకూరుస్తున్నట్లు నిఘా వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా నివేదిస్తోంది.ముజాహిదీన్‌లకు వింటర్ కిట్‌లను అందించేందుకు ఈ విరాళాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఒక్కొక్కరి నుంచి 20వేల పాకిస్థాన్ రూపాయలు అంటే భారత కరెన్సీలో రూ.6,400 విరాళంగా సేకరిస్తున్నట్లు తెలిసింది. ముజాహిదీన్ కోసం బూట్లు, ఉలెన్ సాక్స్, మెట్రెస్, టెంట్ వంటి వస్తువులను కొనుగోలు చేసేందుకు ఈ డొనేషన్లను సేకరిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ విరాళాలను పాకిస్థాన్‌కు చెందిన సదాపే వంటి డిజిటల్ పేమెంట్ యాప్‌ల నుంచి స్వీకరిస్తున్నట్లు సమాచారం. మేడమ్ సర్జన్ గా వ్యవహరిస్తున్న ఎర్రకోట పేలుడులో కీలక అనుమానితుల్లో ఒకరైన డాక్టర్ షాహీనా సాయిద్ ఈ విరాళాల బాధ్యత తీసుకున్నట్లు తేలింది. దీంతో ఈ డిజిటల్ ఫండింగ్ నెట్‌వర్క్‌పై దర్యాప్తు అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు.మరోవైపు పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ తన కార్యకలాపాలను విస్తరించేందుకు కొత్త కుట్రకు తెరలేపిన విషయం తెలిసిందే. కేవలం మహిళలతో ఓ ఉగ్రవాద గ్రూప్‌ను తయారుచేస్తున్నది. మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ నేతృత్వంలో 'జమాతుల్-ముమినాత్' పేరుతో ఓ ప్రత్యేక యూనిట్‌ను తయారుచేస్తున్నది. మహిళలకు ఆన్‌లైన్ జిహాదీ కోర్సులను కూడా ప్రారంభించింది. ఇందులో భాగంగానే భారత్‌లోని మహిళలను ఆకర్షించేందుకు కుట్రలు పన్నుతోందని నిఘా వర్గాలు గుర్తించాయి. భారత్‌లో జైషే మహిళా విభాగం బాధ్యతలను ఎర్రకోట పేలుడులో కీలక అనుమానితుల్లో ఒకరైన డాక్టర్ షాహీనా సాయిద్‌కు అప్పగించినట్లు తేలింది. 'మేడమ్ సర్జన్' పేరుతో ఆమె ఉగ్ర కార్యకలాపాలను సాగిస్తున్నట్లు దర్యాప్తు అధికారులు ఇప్పటికే గుర్తించారు.

# ఐ బొమ్మ రవికి పోలీస్ కస్టడీ

(మొదటి తరువాయి)

ఇరు పక్షాల వాదనలు విన్న జడ్జి.. రవిని ఐదు రోజుల పాటు పోలీసు కస్టడీకి అనుమతించారు. కస్టడీ విచారణలో మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఈ కేసుపై ఈడీ దృష్టి సారించింది. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పైరసీ మూవీ రాకెట్ ఐబొమ్మ కీలక సూత్రధారి రవిని సైబర్ క్రైమ్ పోలీసులు గత శనివారం కూకట్‌పల్లిలో అరెస్టు చేశారు. ఓటీటీ వేదికల్లోని కంటెంట్ సహా కొత్తగా రిలీజ్ అయిన సినిమాలు పైరసీ చేస్తూ సినీ పరిశ్రమకు తీవ్ర నష్టం కలిగించాడు. గత ఏడేళ్లుగా ఐ బొమ్మ, బప్పం, ఐవిన్, ఐరాధ టీవీ పేర్లతో వెబ్‌సైట్లు నిర్వహించాడు.

# మారేడిమిల్లిలో మరో భారీ ఎన్‌కౌంటర్

(మొదటి తరువాయి)

మేరకు పోలీసులు కూంబింగ్ చేపట్టి.. మావోయిస్టుల కదలికలను గమనించారు. నవంబర్ 17న ఒక ఆపరేషన్ ప్రారంభించాం. 18న ఉదయం అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో సెంట్రల్ కమిటీ మెంబర్ హిడ్మాతో పాటు మరో ఐదుగురు మావోయిస్టులు హతమయ్యారు. ఇక ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో 50 మంది మావోయిస్టులను అరెస్టు చేశామన్నారు. వీరిలో స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్లు ముగ్గురు, ప్లాటూన్ మెంబర్లు 23 మంది, డివిజినల్ కమిటీ మెంబర్లు ఐదుగురు, ఏరియా కమిటీ మెంబర్స్ 19 మంది ఉన్నట్లు తెలిపారు. పట్టుబడ్డ మావోయిస్టుల నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

# తెలంగాణలో పంచాయితీ ఎన్నికలపై కసరత్తు

(మొదటి తరువాయి)

మరోసారి సవరణకు ఎస్‌ఈసీ షెడ్యూలు ప్రకటించింది. రాష్ట్రంలో డిసెంబరు రెండో వారంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు షెడ్యూలు వెలువడే అవకాశం ఉంది. అదే నెలాఖరులోపు పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తిచేసే వీలుంది. డిసెంబరు 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాల తర్వాత పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు మంత్రిమండలి నిర్ణయం నేపథ్యంలో ఈ ప్రక్రియపై రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ, రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టి సారించాయి. గురువారం 20వ తేదీ నుంచి ఈనెల 23 వరకు గ్రామాల్లో కుట్టల జాబితాలను సవరించాలని నిర్ణయించింది. 20న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణ, తప్పుల సవరణ, 21న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కారం, 23న తుది ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణ ఉంటుందని ఎన్నికల సంఘం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈమేరకు జిల్లా పంచాయతీ అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశాలు జారీ చేశారు.సోమవారం మంత్రిమండలి భేటీలో 'స్థానిక' ఎన్నికలపై విస్తృతంగా చర్చ జరిగింది. రిజర్వేషన్ల అమలు, రాష్ట్ర హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలు, న్యాయనిపుణుల సలహాలపై పంచాయతీరాజ్‌శాఖ నివేదిక ఇవ్వగా దానిపై మంత్రులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈనెల 24న హైకోర్టులో విచారణ గురించి చెప్పారు.

# హిందూ మహిళలు మేల్కోవాలి

ఆస్తులుంటే వీలునామా రాయండి
ఆస్తి విషయమై మహిళ పుట్టింటి వాళ్లకు, అత్తింటి వారికి మధ్య వివాదాలు చెలరేగుతున్నాయి
సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ,**

దేశంలో హిందూ మహిళల ఆస్తులపై గత కొన్నేళ్లుగా వివాదాలు చోటుచేసుకుంటున్న వేళ సుప్రీంకోర్టు కీలక సూచన చేసింది. హిందూ మహిళ ఆస్తి కోసం పుట్టింటివారు, అత్తింటి వారు కోర్టు మెట్లు ఎక్కుతున్న ఘటనలు అనేకం జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజాగా కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళలు తమ మరణానంతరం ఆస్తిపై వివాదం లేకుండా ఉండాలంటే.. వారు బతికి ఉండగానే ఆస్తి ఎవరికి చెందాలనే విషయంలో స్పష్టంగా వీలునామా రాయాలని సూచించింది. మహిళకు పిల్లలు లేకపోతే ప్రస్తుత హిందూ వారసత్వ చట్టం ప్రకారం ఆమె ఆస్తి మొదటగా భర్త కుటుంబానికి వెళ్లే అవకాశం ఉంటుందని కోర్టు గుర్తుచేసింది. కానీ చాలా సందర్భాల్లో ఆస్తి విషయమై మహిళ పుట్టింటి వాళ్లకు, అత్తింటి వారికి మధ్య వివాదాలు చెలరేగుతున్నాయని పేర్కొంది. వివాహానంతరం మహిళ గోత్రం మారుతుందన్న సంప్రదాయ అంశాన్ని కూడా కోర్టు ప్రస్తావిస్తూ.. వివాహం తర్వాత మహిళపై ప్రధాన బాధ్యత భర్త కుటుంబానిదే అవుతుందని పేర్కొంది. కానీ పిల్లలు లేని మహిళల ఆస్తుల విషయంలో, విడాకులు తీసుకోకుండా భర్తకు దూరంగా ఉంటున్న మహిళల ఆస్తుల విషయంలో వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ కారణంగా వారసత్వ హక్కుల్లో తలెత్తే సమస్యలు పరిష్కరించేందుకు ప్రీ?లిటిగేషన్ మిడియేషన్ (మధ్యవర్తిత్వం) తప్పనిసరి చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మధ్యవర్తిత్వంలో వచ్చే ఒప్పందాలను కోర్టు తీర్పు (డిక్రీ) గా పరిగణించాలని తెలిపింది. కొంతమంది న్యాయవాదులు ప్రస్తుత వారసత్వ చట్టంలోని సెక్షన్ 15(1)(బి) వివక్షాత్మకమని అభిప్రాయపడుతున్నారని, దాన్ని మార్చాలంటే చట్టసవరణ చేయాలని, అది పార్లమెంట్ చేయాల్సిన పని మాత్రమేనని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది.

# పాలనలో ఇందిరాగాంధీ ఓ రోల్‌మోడల్

(మొదటి తరువాయి)

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరా గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా పాలన చేస్తున్నామని, మహిళలకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం ఇస్తున్నామని సీఎం చెప్పారు. వెయ్యి ఆర్టీసీ బస్సులకు మహిళలను ఓనర్లను చేశామని గుర్తుచేశారు. ఇందిరాగాంధీ పాలన దేశానికి దిక్సూచి అని సీఎం రేవంత్ కొనియాడారు. వైఎస్ఆర్ హయంలో 25 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టించారని, డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని చెప్పి బీఆర్ఎస్ మోసం చేసిందని సీఎం విమర్శించారు. రాష్ట్రంలో 4 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నామని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మహిళలను భాగస్వాములను చేస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు. 65 లక్షల చీరలను గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పంపిణీ చేస్తామని, డిసెంబర్ 9 వరకూ ఇంటింటికీ చీరల పంపిణీ కొనసాగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కోటి మంది మహిళలకు కోటి చీరలు పంపిణీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మార్చి ఫస్ట్ నుంచి 8 వరకూ రెండో విడతలో చీరల పంపిణీ ఉంటుందని, రెండో విడతలో 35 లక్షల చీరలను పట్టణాల్లో పంపిణీ చేస్తామని సీఎం రేవంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ చీరల పంపిణీని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. పలువురు మహిళలకు చీరలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి,



దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ, సీతక్క పాల్గొన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయనున్నారు. నేటి నుంచి తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం డిసెంబరు 9 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. రెండో దశలో మార్చి 1 నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8 వరకు పట్టణ ప్రాంతాల్లో అందజేయనున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా చీరల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పంపిణీని మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలని చెప్పారు. ఇందుకు నియోజకవర్గానికో ప్రత్యేక అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. మహిళలకు చీరలు పంపిణీ చేసి.. వారి వివరాలు సేకరించాలని ఆదేశించారు. దీని ద్వారా భవిష్యత్తులో సంక్షేమ పథకాలు వర్తిస్తాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల మంది మహిళలకు, మున్సిపాలిటీల్లో 35 లక్షల మంది మహిళలకు చీరల పంపిణీ చేస్తామని వివరించారు.ఇందిరమ్మ స్ఫూర్తితో మా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. మహిళలు పెట్రోల్ బంకులు నిర్వహించుకునేలా ప్రోత్సహించాం. ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలను యజమానులను చేశాం. మహిళల సంక్షేమంతో పాటు ఆర్థిక ఉన్నతి కలిగించే కార్యక్రమాలు చేపట్టాం. ఆడబిడ్డల పేరుతోనే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నాం. రాజకీయాల్లోనూ మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించాం. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం పనిచేస్తోంది. తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం తరఫున సారె పెట్టి గౌరవించాలని భావించాం. అందుకే కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించాం. మహిళా మంత్రులు, మహిళా ఎమ్మెల్యేలు, మహిళా అధికారులు ఇందిరమ్మ చీర కట్టుకోవాలి. మీరే బ్రాండ్ అంబాసిడర్‌గా మారి ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటాలని సీఎం అన్నారు.

# పార్టీలో ఉంటునే సొంతవారిపై పోస్టులు

(మొదటి తరువాయి)

'పార్టీ కార్యకర్తలు ఎవరైనా ఇష్టమొచ్చినట్లు కామెంట్ చేస్తే సస్పెండ్ చేస్తాం, టైమ్ కూడా ఇవ్వం. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఫేక్ అకౌంట్స్ ద్వారా బీజేపీపై పోస్టులు పెడుతున్నాయి. పార్టీ నేతలు ఒక మంత్రి దగ్గరకు వెళితే.. పిర్యాదు చేసేందుకు వెళ్లారని రాశారు. ఆ పేపర్ మీద రూ.5 కోట్ల పరువు నష్టం దావా వేశాం. మేము బీజేపీ అంటూనే.. బీజేపీ నేతల మీదనే పోస్టింగ్‌లు పెడుతున్నారు. కేసులు పెట్టి జైలుకు పంపిస్తాం. ఇప్పటికే కేసులు పెట్టాం. పార్టీ మీద ఎవరు పోస్టులు చేసినా కౌంటర్ ఇవ్వండి. బీజేపీ చిల్లర రాజకీయాలకు భయపడదు. దమ్ముంటే ముందుకు వచ్చి మాట్లాడండి' అని రామచందర్ రావు అన్నారు. 'డబ్బులిస్తే ఏది పడితే అది రాస్తున్నారు, మాట్లాడుతున్నారు. ఎవరిని ఉపేక్షించేది లేదు. యూట్యూబ్‌లో మాట్లాడుతున్నారు. ఒకరు దుబాయ్, మరొకరు అమెరికాలో ఉండి తిడుతున్నారు. మీరు ఇండియాకు రండి మీ సంగతి చెబుతాం. పార్టీ కార్యకర్తలను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీ నేతలు ఎవరిని ప్రోత్సహించినా, వాటిని ఫార్వర్డ్ చేసినా సిరియస్ యాక్షన్ ఉంటుంది. నా మీద కూడా ఫేక్ వార్తలు వస్తాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలకు వార్నింగ్ ఇస్తున్నా, మా మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేయకండి. సోషల్ మీడియా, యూట్యూబ్ వారికి విజ్ఞప్తి చేస్తున్నాం.. మీ వ్యక్తిత్వాన్ని చంపుకోవద్దని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు కోరారు.

# జూబ్లీహిల్స్‌లో దొంగ ఓట్లతో గెలుపు

(మొదటి తరువాయి)

ఈ సమావేశానికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు, మాగంటి సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, కార్యకర్తల కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలకు సంబంధించి చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మాగంటి సునీతకు బీఆర్ఎస్ అండగా నిలిచిందన్నారు. సునీతాగోపీనాథ్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యుల్లా పని చేశారన్నారు. వచ్చే కార్పొరేటర్ ఎన్నికల్లో కార్యకర్తల గెలుపు కోసం కాలికి బలపం కట్టుకొని తిరుగుతామన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డాయని ఆరోపించారు.విషాదంలో ఉన్న మహిళను అంకితభావంతో పని చేశారని, స్థానిక ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుపు కోసం అందరి కృషి చేద్దామన్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది ఉన్నా పూర్తి అండగా ఉంటామన్నారు. ఎవరికి సమస్య వచ్చినా తెలంగాణ భవన్‌కు రావొచ్చన్నారు. డిసెంబర్‌లోగా సర్పంచ్, జిల్లా పరిషత్ ఎన్నికలు పూర్తయ్యే అవకాశం ఉందని, స్థానిక ఎన్నికలు పూర్తి కాగానే బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు చేపడుతామన్నారు. బూత్‌లవారీగా పటిష్ఠంగా పార్టీ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. జూబ్లీహిల్స్‌లో 407 బూతుల్లో ఒక్కో బూత్‌కు 10 మంది చొప్పున పార్టీని పటిష్ఠం చేసుకోవాలన్నారు. ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతుక్కోవాలని.. ప్రజా సమస్యలపై పోరాటం ఇప్పటి నుంచే మొదలుపెట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# నేడు బీహార్ సీఎంగా మరోమారు నితీశ్ ప్రమాణం

(మొదటి తరువాయి)

శాసనసభా పక్ష నేతగా నితీశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేపీ లెజిస్లేచర్ పార్టీ నేతలు సైతం సమావేశమై పార్టీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హా ఉప ముఖ్యమంత్రులుగా తిరిగి కొనసాగించాలని నిర్ణయించారు. అనంతరం ఎన్డీయే సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దిలీప్ జైశ్వాల్, సామ్రాట్ చౌదరి, చిరాగ్ పాశ్వాన్, కేశవ్ ప్రసాద్ మౌర్య, విజయ్ కుమార్ సిన్హా, రాజు తివారి సహా ఎన్డీయేకు చెందిన 202 మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఎన్డీయే లెజిస్లేచర్ పార్టీ నేతగా నితీశ్ కుమార్ పేరును సామ్రాట్ చౌదరి ప్రతిపాదించగా, ఎమ్మెల్యేలంతా బలపరిచారు. దీంతో నితీశ్ 10వ సారి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. ఈ సమావేశానంతరం నితీశ్ సారథ్యంలోని పలువురు నేతలు గవర్నర్‌ను కలుసుకున్నారు. మరోవైపు, నితీశ్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి భారీ ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. పాట్నాలోని గాంధీ మైదానంలో 20వ తేదీ మధ్యాహ్నం 11.30 గంటలకు ప్రమాణస్వీకారం ఉంటుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు ఈ ప్రమాణస్వీకారోత్సవానికి హాజరవుతున్నారు. దీంతో బీహార్‌లో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. తదుపరి ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ ఖరారయ్యారు. ఈ మేరకు ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు.. తమ కూటమి నేతగా నితీశ్‌ను ఎన్నుకున్నారు. జేడీయూ సుప్రీం నితీశ్ కుమార్ ఎన్డీయే (జెడియు) నేతగా బుధవారంనాడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో ఆయన బిహార్ ముఖ్యమంత్రిగా 10వ సారి ప్రమాణస్వీకారానికి మార్గం సుగమమైంది.కొత్త మంత్రివర్గంలో బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హా తిరిగి ఉప ముఖ్యమంత్రులుగా కొనసాగనున్నారు. ఈ మేరకు బీజేపీ ఎల్పీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే 243 స్థానాల్లో 202 స్థానాలు గెలుచుకుని అఖండ విజయం సొంతం చేసుకుంది. ఎన్డీయే ప్రధాన భాగస్వామ్య పార్టీ అయిన బీజేపీ 89 సీట్లు గెలుచుకుని బిహార్‌లో ఏకైక పెద్ద పార్టీగా నిలిచింది. ఆ తర్వాత స్థానంలో 85 సీట్లతో జేడీయూ నిలిచింది. ఎన్డీయే కూటమిలోని ఎల్‌జేపీఆర్‌వీ 19 సీట్లు, హెచ్ఏఎం 5, ఆర్ఎల్ఎం 4 సీట్లు గెలుచుకున్నాయి.

# ఉమర్‌ది ముమ్మాటికీ ఉగ్రవాదమే

(మొదటి తరువాయి)

చంపడం ఘోరమైన పాపమని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'ఢిల్లీ పేలుళ్ల నిందితుడు ఉమర్ నబీ ఆత్మాహుతి బాంబు దాడిని సమర్థిస్తున్న వీడియో ఒకటి ప్రచారంలో ఉంది. సూసైడ్ బాంబింగ్ గురించి అందరూ తప్పుగా అర్థం చేసుకుంటారని.. వాస్తవానికి అదొక బలిదాన ఆపరేషన్‌గా అతడు అభివర్ణించారు. అయితే, ఇస్లాంలో ఆత్మహత్య, అమాయకులను చంపడం ఘోరమైన పాపం. ఇలాంటి చర్యలు దేశ చట్టాలకు కూడా పూర్తి విరుద్ధం. దీన్ని తప్పుగా అర్థం చేసుకోవడానికి వీలు లేదు. ఇది ముమ్మాటికీ ఉగ్రవాదమే' అని ఒవైసీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. మరోవైపు దేశ రాజధాని సమీపంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకోవడం, ఢిల్లీ పేలుడులో ముడిపడి ఉన్న ఉగ్రవాద మాడ్యూల్‌పై ఒవైసీ కేంద్రాన్ని ప్రశ్నించారు. 'గత ఆరు నెలల్లో స్థానిక కశ్మీరీలు ఎవరూ ఉగ్రవాద సంస్థల్లో చేరలేదని ఆపరేషన్ సిందూర్, మహదేవ్ సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటుకు తెలిపారు. మరి ఈ గ్రూప్ ఎక్కడి నుంచి వచ్చింది..?' అంటూ ఆయన నిలదీశారు. ప్రస్తుతం ఒవైసీ ట్వీట్ వైరల్ అవుతోంది.

# వడ్డెర ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి

**- దేవరకొండ వడ్డెర సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఇరగ దిండ్ల కృష్ణ డిమాండ్.**



**దేవరకొండ నవంబర్ 19.(నీలగిరి ఎక్స్ ప్రెస్).** అత్యంత దీనమైన వడ్డెర కులస్తులు రాళ్లు కంకర పెద్ద ప్రాజెక్టుల్లో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు వీళ్లకు ఈ పని తప్ప మరో అవకాశం లేదు దయచేసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర వడ్డెర కులాన్ని కార్పొరేషన్ ఏర్పాటు చేసి అన్ని విధాలుగా ఆదుకోవాలని అలాగే కాంట్రాక్టు పనులలో వడ్డెర సొసైటీలకు గవర్నమెంట్ పిలిచే టెండర్లలో 20 లక్షల వరకు వన్ పర్సెంట్ ఈఎండి లేకుండా జీవో ఇవ్వాలి అలాగే క్లాస్ వన్ క్లాస్ టు క్లాస్ వన్ ఎటువంటి బ్యాంకు సాల్వెన్సీ లేకుండా జీవో ఇవ్వాలి ప్రతి గవర్నమెంట్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్లలో బ్యాంకు సాల్వెంచి తప్పనిసరిగా ఇప్పటే చేస్తాము అని అంటున్నారు 2014 సంవత్సరంలో గవర్నమెంట్ వడ్డెర కులం వారికి ఎటువంటి ఆస్తిపాస్తులు ఉండవు కాబట్టి జీవో రిలీజ్ చేశారు .అయినా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కొత్త జీవోలు తీసుకొచ్చి సమస్య పరిష్కరించాలనితప్పనిసరిగా పెట్టవలసింది అలా అయితేనే గవర్నమెంట్ డిపార్ట్మెంట్లలో రిజిస్ట్రేషన్ చేస్తాము అని ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్లో ఆఫీసర్స్ అంటున్నారు దయచేసి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి , మంత్రివర్గ బృందం కొత్త జీవో రిలీజ్ చేయాలని సాల్వంచి అవసరం లేదు వడ్డెర కులస్తులకు అన్ని జీవో ఇవ్వాలి రిలీజ్ చేయాలి వడ్డెర సంగం దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు ఇరగ దిండ్ల కృష్ణ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నాను జీవో తీయని ఎడల తెలంగాణ రాష్ట్రంలో 3400 మంది వడ్డెర సొసైటీ కాంట్రాక్టు సభ్యులు ఉన్నారు మేమందరం కలిసి మా రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు శివరాత్రి ఆయిల్ మల్లు మరియు తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం, అధ్యక్షులు పీట్ల మల్లేష్ తెలంగాణ రాష్ట్ర కమిటీ జిల్లాలలో ఉన్న సొసైటీ సభ్యులందరం అసెంబ్లీ ముట్టడించడం జరుగుతది అని అన్నారు.

## బిజెపి జిల్లా కార్యాలయంలో ఘనంగా ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి



**నాగర్ కర్నూల్, నవంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):** బిజెపి పట్టణ అధ్యక్షుడు చవ్వ ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో ఈ రోజు జిల్లా కార్యాలయంలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేందర్ గౌడ్ మాట్లాడుతూ, బ్రిటీష్ వారికి ఎదురొడ్డి పోరాడిన వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జీవితం దేశభక్తి, పోరాటపటిమ, వీరత్వానికి ప్రతీకగా నిలిచిందని అన్నారు. ఆమె ధైర్యసాహసాలు మహిళలకు ఆదర్శప్రాయమని, చిన్న వయసులోనే గుర్రపు స్వారీ, ఖడ్గయుద్ధం, తుపాకీ వినియోగం, విల్లు విద్యలో ప్రావీణ్యం సాధించిన వీరమాతగా చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు.నాగేందర్ గౌడ్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాటంలో ఝాన్సీ లక్ష్మీబాయి చూపిన త్యాగం, దేశభక్తి అందరికీ స్ఫూర్తిదాయకమని, ఆమె ఆశయాలను స్మరించుకోవడం మన అధ్యక్షమని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్బారెడ్డి, ఎన్నికల ఓటర్లింగ్ జిల్లా కన్వీనర్ బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి, పోల్దాస్ రాము, యాదగిరి రావు, జగదీశ్వర్ రెడ్డి, సోమ ప్రగతి, లక్ష్మీ, బాలరాజు, నాగనోలు కృష్ణ, సూరంపల్లి సుధాకర్, సైదులు, సూరి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఘన నివాళులు



**మిర్యాలగూడ, నవంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో భారతదేశపు తొలి మహిళా ప్రధానమంత్రి స్వర్గీయ శ్రీ ఇందిరా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని ఆమె విగ్రహానికి కూడా పూలమాలలు వేసి గౌరవం తెలిపారు.తరువాత పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రాజీవ్ భవన్‌లో పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఇందిరా గాంధీ జీవితం ఎంతోమంది రాజకీయ నాయకులకు, మహిళా లోకానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఆమె జయంతి సందర్భంగా, గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిన మిర్యాలగూడ పట్టణంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు డిసెంబర్ 31వ తేదీ లోపు అర్హులకు ఇళ్లు అందజేస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మిర్యాలగూడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరాగాంధీ సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిలో నిలిచిపోతాయి

**-ధైర్య సాహసాలకు నిలువెత్తు నిదర్శనం మహిళామణి శ్రీమతి ఇందిరాగాంధీ**
**-ఎమ్మెల్యే - కసిరెడ్డి నారాయణరెడ్డి**



**కడ్తాల్, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కడ్తాల్ మండల కేంద్రంలో దివంగత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న శ్రీమతి ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్ పార్టీ మరియు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో వారి ఆశయాలను కొనసాగించాలని కోరుతూ ఇందిరాగాంధీ విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ దేశ అభివృద్ధికి, పేదల సంక్షేమానికి, మహిళా సాధికారతకు ఇందిరాగాంధీ కృషి అప్రతిహతమని అన్నారు. ఆమె ధైర్యసాహసాలు, దూరదృష్టి, నాయకత్వం భారత రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. బ్యాంకుల జాతీయకరణ, గ్రీన్ రివల్యూషన్, పేదల సంక్షేమం కోసం అమలు చేసిన కార్యక్రమాల సంస్కరణల ద్వారా దేశాన్ని ఆర్థికంగా బలపరిచారని గుర్తుచేశారు. పేదల గుడిసెలను ఇళ్లుగా చేసి ఎల్లప్పుడూ పేదల సంక్షేమం కోసమే కృషి చేసిన మహానుభావురాలని కొనియాడారు. పేదల కోసం జీవితాంతం పోరాటం చేసిన ఆమె అమలు చేసిన పథకాలు నేటికీ కోట్లాదిమందికి అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ గారు భారత దేశాన్ని అంతర్జాతీయ వేదికపై శక్తివంతమైన దేశంగా నిలబెట్టిన అసాధారణ నాయకురాలని అన్నారు. దేశ ఆర్థిక, రక్షణ వ్యవస్థలను బలోపేతం చేసి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన ఇందిర గాంధీ ఆశయాలను కొనసాగించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పరిపాలన సాగిస్తోందని, ప్రతి వర్గానికి న్యాయం జరుగుతున్నదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, డిసిసి అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి బిక్కు నాయక్, సేవాదళ్ అధ్యక్షులు లక్ష్మయ్య, సీనియర్ నాయకులు బ్రహ్మచారి, జహంగిర్ అలీ, యాదయ్య గౌడ్, జాంగిర్ బాబా, చందోజీ, బిక్షపతి, యాదగిరి రెడ్డి, శ్రీను, హీరాసింగ్, జాన్య నాయక్, నరేందర్, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్యామ రాజేష్, అసెంబ్లీ ఉపాధ్యక్షులు షాబుద్దీన్ ఇమ్రాన్, మండల అధ్యక్షులు బోస్ రవి, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ కర్రోళ్ల రమేష్, టౌన్ అధ్యక్షులు బానుకిరణ్, యూత్ నాయకులు తులసి రామ్, భరత్ యాదవ్, సోమరాజు సందీప్, శ్రీకాంత్, ఎర్రోళ్ల మహేష్, రమేష్, శ్రీను, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి



**మానకొండూర్, నవంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):** గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం మానకొండూర్ మండలం శంషాబాద్‌లో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాలు ప్రగతి సాధిస్తాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు పాలుపంచుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులపై ప్రజలు దృష్టి సారించినప్పుడే పనుల్లో నాణ్యత పెరుగుతుందని పేర్కొన్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టే పనులపై ప్రజలు నిరాసక్తత చూపకూడదని ఆయన అన్నారు. సొంత భవనాలు లేని పంచాయతీలకు, అలాగే నూతన పంచాయతీలకు భవన నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. అన్నివర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇచ్చిన హామీలను అమలు పరుస్తోందని ఆయన స్పష్టం చేశారు.మానకొండూర్ మండలం వన్నారం, గట్టుదుద్దెనపల్లి గ్రామాల్లో పంచాయతీ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమాల్లో మండల పరిషత్ అభివృద్ధి అధికారి వరలక్ష్మి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ తిరుమల్ రెడ్డి, పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, రామిడి శ్రీనివాస్ రెడ్డి, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, కోండ్ర సురేష్, మడుపు ప్రేమ్ కుమార్, పెంచాల రాజయ్య, ఆకుల నర్సింగరావు, కనుకం కుమార్, నీరడి మొగిలి, పెంచాల రంగయ్య, నాగపురి తిరుమల, కనకం సమ్మయ్య, బాకారపు సమ్మయ్య, బాకారపు రమేశ్, చెలిగంటి ఓదెలు, తాళ్లపల్లి శ్రీకాంత్, తాళ్లపల్లి కొమురయ్య, బనుక తిరుపతి, బాకారపు సంపత్, కనకం లచ్చయ్య, ఆనంద్, కవిత, ప్రసూన, పోలాడి రామారావు, గొల్లెన కొమురయ్య, తమిశెట్టి రాజేశ్, సాయిరి దేవయ్య, దుద్దెల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణ కుల వృత్తులను కాపాడుదాం



**జీడిమెట్ల,నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని పైప్‌లైన్ రోడ్ వద్ద "చీప్ అండ్ బెస్ట్" పేరుతో కార్పొరేట్ హెయిర్ సెలూన్లు స్థానిక నాయి బ్రాహ్మణుల సంప్రదాయ వృత్తిని తీవ్రంగా దెబ్బతీస్తున్న నేపథ్యంలో, వారి జీవనోపాధి రక్షణ కోసం నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది.ఈ ధర్నాలో పాల్గొన్న బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి మాట్లాడుతూ, స్థానిక వృత్తిదారుల హక్కులను కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం వెంటనే ప్రత్యేక జీ.ఓ జారీ చేయాలని, కార్పొరేట్ "చీప్ అండ్ బెస్ట్" సంస్థపై నిషేధం విధించాలని గట్టిగా డిమాండ్ చేశారు. సంప్రదాయ వృత్తులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గడల వెంకటేశ్వర్లు, బీజేపీ 132 జీడిమెట్ల డివిజన్ అధ్యక్షుడు జోగిని రాజు, సిద్దిరాములు, చీఫ్ సెక్రటరీ వి.ఎస్.ఆర్. వెంకట్, చైర్మన్ గద్దం రవీందర్, హరికృష్ణ, ప్రసాద్, రవి, రేణయ్య, కే. పరమేష్, నదీమ్ రాయి, బండారి తిరుపతి దాసు, శ్రీనివాస్, బాచుపల్లి శ్రీనివాస్, బిక్షపతి, నాగరాజు, సతీష్, కాశిరం, బాలు, ఉమాశంకర్, తులసిరాం, సూర్య చంద్రరావు, కుమార్, బాలాజీ, ఎస్.ఆర్. వెంకటేష్, ఏ. సాయి కుమార్, పి. సాయి కుమార్, యాకోబ్, మహేష్, ద్వారక పరమేష్, సి.ఎచ్. నందు, అరవింద్, ఏశ్వంత్, పాపయ్య, శ్రవణ్ బోస్, శ్రీకాంత్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ



**మహేశ్వరం, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా పండ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ కార్మిక శాఖ అధ్యక్షుడు నడికుడ శివ పాల్గొని, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు అందజేశారు.ఈ సందర్భంగా నడికుడ శివ మాట్లాడుతూ, ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల పక్షాన నిలిచే ప్రజాసంక్షేమ పాలన అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు పెద్దపీట వేస్తూ చీరల పంపిణీ, మహిళా సంఘాలకు జీరో వడ్డీ రుణాలు, పెట్రోల్ బంకుల యాజమాన్యం, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు.అలాగే బస్సుల యాజమాన్యాన్ని మహిళలకు అప్పగించడం, సోలార్ పవర్ ప్లాంట్లను అందించడానికి ప్రత్యేక కార్యాచరణలో ప్రభుత్వం ముందుకు వెళ్తోందని తెలిపారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమెకు ఘన నివాళి అర్పిస్తూ, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని నడికుడ శివ స్పష్టం చేశారు.

# ఇందిరా గాంధీ ఆశయ సాధనకు కృషి





**మంచాల, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారతదేశ ప్రథమ మహిళా ప్రధానమంత్రి, ఉక్కు మహిళగా పేరుగాంచిన మహనీయురాలు ఇందిరా గాంధీ 108వ జయంతి వేడుకలు ఆరుట్లలో ఘనంగా నిర్వహించారు. గ్రామశాఖ అధ్యక్షులు రావుల భాషయ్య, కార్యదర్శి దాసరమోని రమేష్ ఆధ్వర్యంలో, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి ఇందిరమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, దేశ సేవకై తన జీవితాన్ని అంకితం చేసిన ఇందిరా గాంధీ ఆశయ సాధనకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉచిత రవాణా సౌకర్యం, ఉచిత గృహ విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, మాజీ సర్పంచులు బైరిక రమాకాంత్ రెడ్డి, చీమల జంగయ్య, సుంకరి పండరీనాథ్, అనంగల్ల యాదయ్య, మేగవత్ మోహన్ నాయక్, కాంగ్రెస్ నాయకులు ముచ్చర్ల వెంకటేష్, కావలి బుగ్గరాములు, గుడిమల్ల చంద్రయ్య, మారగోని మాసయ్య గౌడ్, మార సురేష్, అంతటి రాజుగౌడ్, మాధగోని జంగయ్య గౌడ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వెదిరే సికిందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు రావుల రాఘవ, ఆరుట్ల అధ్యక్షుడు దాసరమోని అశోక్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెరుకు నర్సింహా, కంబాలపల్లి బుగ్గరాములు, బుట్టి కృష్ణ, మార లక్ష్మణ్, బుట్టి జంగయ్య, అలాగే హోటల్ శ్రీనివాస్, ఆర్ల శ్రీకాంత్, భాస్కర్ రైనా, పాండాల శ్రీనివాస్, బుడిగల పరమేష్, రావుల నాగరాజు, మంకు ప్రవీణ్, అనంగల్ల రమేష్, లక్ష్మానాయక్, జిలమోని శ్రీనివాస్, అమంచ జగన్, ఎండి అశ్రఫ్, గొరిగే కృష్ణ, పల్లె రాములు, ప్రజాగలం భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

## బైండోవర్ నోటీసులు ధిక్కరించిన వ్యక్తి పై కేసు నమోదు

**- ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్.**



**దేవరకొండ నవంబర్ 19.(నీలగిరి ఎక్స్ ప్రెస్).** నల్లగొండ జిల్లా నేరేడు గుమ్మ మండలం జోడుబాయి తండ గ్రామవాసి సభావత్ శంకర్ తండ్రి అనుచారి అనే వ్యక్తి క్రైమ్ నెంబర్ 380/2025.27/9/2025 నాడు నల్ల బెల్లం పటిక సరఫరా కేసులో నిందితుడిగా ఎక్సైజ్ వారికి పట్టుబడ్డాడు. నేరేడంగొమ్మ మండల రెవెన్యూ అధికారి ముందు బైండోవర్ అవ్వగా మళ్లీ నిందితుడు గా ఉండటం వలన నేరేడుగోమ్ము మండల రెవెన్యూ అధికారి బైండోవర్ నోటీసు జారీ చేయగ ,అట్టి నోటీసును ధిక్కరించిన కారణం చేత ఎమ్మార్వో ఆదేశాల మేరకు దేవరకొండ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ నిందితుని దేవరకొండ సబ్ జైలుకు తరలించారు. అనంతరం సి.ఐ. మాట్లాడుతూ బైండ్ ఓవర్ నోటీసులు ఉల్లంఘించే నిందితుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.

## ఎలిగేడులో ఉక్కు మహిళ ఇందిరాగాంధీ కి ఘన నివాళులు.



**ఎలిగేడు, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** భారతదేశ మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఎలిగేడు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సామ రాజేశ్వర్ రెడ్డి, ఎలిగేడు మాజీ ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిరుపేదల గుండెల్లో చిరాస్థాయిగా ఇందిరమ్మ నిలిచిపోయిందని ఆమె సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు సింగిల్ విండో డైరెక్టర్ తాటిపెల్లి. రమేష్ బాబు, లాలపల్లె మాజీ సర్పంచ్ బాసంపల్లి కొండయ్య, కాంగ్రెస్ నాయకులు కట్ల తిరుపతి, అమ్ముల రమేష్,, ముంజం ముత్యాలు, బండ రమేష్, కట్ల ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి కృప ప్రజలందరిపై ఉండాలి

**-నడికుడ శివ**



**తుక్కుగూడ, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో కార్మిక శాఖ అధ్యక్షుడు నడికుడ శివ కుటుంబ సమేతంగా అయ్యప్ప స్వామి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వామి కృప ప్రజలందరి పైన ఉండాలని ఆకాంక్షించారు. పూజ అనంతరం 41 రోజుల భక్తిశ్రద్ధలతో అయ్యప్ప దీక్షను పాటించడం, శబరిమలై యాత్రకు బయలుదేరే ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన భక్తులను కోరారు. ప్రజలందరూ భక్తి, నియమ నిష్టలతో పూజలు నిర్వహించి స్వామి అనుగ్రహాన్ని పొందాలని నడికుడ శివ సూచించారు.

## ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఘన నివాళులు



**షాపూర్ నగర్,నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారతదేశపు తొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జన్మదినం సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం నివాసంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం మాట్లాడుతూ, పేదల సంక్షేమం కోసం ఇందిరా గాంధీ ప్రవేశపెట్టిన గరిబీ హఠవో, రైతుల అభ్యున్నతి, మహిళ సాధికారత, సాంకేతిక రంగం అభివృద్ధి, బ్యాంకుల జాతీయకరణ వంటి అనేక పథకాలను గుర్తుచేశారు. భారతదేశ ప్రజాసౌమ్య బలాన్ని ప్రపంచానికి తెలియజేసిన వీరనారి ఇందిరా గాంధీ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు, సేవదల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులు అర్పించారు.

## బిఆర్ఎస్‌లో అవినీతి తిమింగలాలు

**-ఎమ్మెల్యే మేఘారెడ్డి విమర్శలు**




**వనపర్తి, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బిఆర్ఎస్‌లో భారీ అవినీతి తిమింగలాలు ఉన్నాయని, మాజీ ముఖ్యమంత్రి కె.సి.ఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత బయటపెట్టిన పేర్లపై ఇప్పటివరకు ఒక్కరు స్పందించలేదని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. బుధవారం వనపర్తి క్యాంపు కార్యాలయంలో జరిగిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ హయాంలో నిర్మించిన పాత ప్రాజెక్టులకు బొక్కలు పెట్టి పేర్లు మార్చుకుని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరమని ఎద్దేవా చేశారు. కళాకారులకు గౌరవం ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని పేర్కొన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కళాకారులు ఆటబొమ్మలుగా మారిపోయారని, ఇల్లు లేని పేదలకు ప్రతి గ్రామంలో ఇండ్లను అందించిన ఘనత మాత్రం కాంగ్రెస్‌దేనని మేఘారెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికలు కాంగ్రెస్ పట్ల ప్రజల నమ్మకాన్ని ప్రతిబింబించాయని, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రుణమాఫీ, రైతుభరోసా వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం ఇదేనని వివరించారు. "ఎమ్మెల్యేగా పెద్ద జీతగాడిలా కాకుండా, ప్రజాసేవకుడిలా పనిచేస్తా అన్న మాట మీదే నిలుస్తున్నాను. ఎక్కడైనా లోపం ఉంటే నేరుగా నాకు చెప్పండి" అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ప్రమోదుని రెడ్డి, పుట్టపాకుల మహేష్, పాకనాటి కృష్ణయ్యతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాగృతి 'జనం బాట'లో భాగస్వామ్యం కండి

**-కప్పటి పాండురంగారెడ్డి**



**కందుకూర్, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పటి పాండురంగారెడ్డి మాట్లాడుతూ, జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న 'జనం బాట' పర్యటనకు జిల్లాలో ఏర్పాట్లు ఊపందుకున్నాయని తెలిపారు. ప్రజల్లోకి నేరుగా వెళ్లి వారి సమస్యలను అర్థం చేసుకోవడమే ఈ పర్యటన లక్ష్యమని పేర్కొన్నారు. కవిత నవంబర్ 20న శేరిలింగంపల్లి, మదల, రాజేంద్రనగర్, చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో, నవంబర్ 21న మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, ఎల్బీ నగర్ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నాయకులు రూట్‌మ్యాప్ సిద్ధం చేస్తూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కప్పటి పాండురంగారెడ్డి మాట్లాడుతూ, జనం బాట ప్రజల వాస్తవ జీవన పరిస్థితులను తెలుసుకునే వేదికగా మారిందని, గ్రామాలు, బస్తీలు తిరుగుతూ ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుంటూ కవిత ముందుకు వచ్చిన తీరు ప్రశంసనీయం అని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో జాగృతి, అవగాహన మరింత పెరుగుతోందని, ప్రజల స్పందన ఉత్సాహభరితంగా ఉందని తెలిపారు. ఈ పర్యటనతో జిల్లాలోని సమస్యలు స్పష్టంగా బయటపడతాయని, వాటి పరిష్కారానికి జాగృతి ప్రయత్నాలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

## తెలంగాణ ముదిరాజ్ మహాసభ వార్షికోత్సవ వేడుకలు



**కొండపాక, నవంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కొండపాక మండలంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ 11వ వార్షికోత్సవ వేడుకలు, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు జీర రాజు ముదిరాజ్, యూత్ అధ్యక్షుడు సున్నం భాస్కర్ ముదిరాజ్, అలాగే మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ముదిరాజ్ సంఘ అధ్యక్షులు, మత్స్యశాఖ చైర్మన్ల ఆధ్వర్యంలో వాల్‌పేపర్‌ను వెలుకట్ట X చౌరస్తాలో విడుదల చేశారు. నవంబర్ 21న పల్లె పల్లెల్లో ముదిరాజ్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి పాతర్ల కొండలు, మిద్దె శివకుమార్, నీల సత్యం, కోల స్వామి, సుదర్శన్, ఉపేందర్, ఆంజనేయులు, శ్రీనివాస్, నర్సింలు, బండి చంద్రం, రాజు, కిష్టయ్య, ఇతర సభ్యుల ఆధ్వర్యంలో గోడ పత్రికను విడుదల చేశారు. ఈ వేడుకలో పాల్గొన్న నాయకులు, సభ్యులు ముదిరాజ్ సమాజ ఐక్యత, అభివృద్ధి కోసం కృషి చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు.

## ఘనంగా శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప స్వామి మహాపడి పూజ మహోత్సవం



**జీడిమెట్ల,నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో శ్రీ అయ్యప్ప స్వామి మహాపడి పూజ మహోత్సవ కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని ప్రసూనా నగర్ శ్రీ కోదండరామాలయంలో అత్తోట భాస్కర్ నాయుడు, నాగమణి ఆధ్వర్యంలో జరిగిన మహాపడి పూజలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తి భావంతో వేడుకలను ఘనంగా జరిపారు. తదుపరి దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేట్ ప్రణీత్ ప్రణవ్ బ్ల్యూమ్స్ విల్లాలో పీసరి మహేందర్ రెడ్డి (గురుస్వామి) ఆధ్వర్యంలో మహాపడి పూజ మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# జర్నలిస్టుల ప్రాణాలు పోతున్నాయి కాపాడండి

## రంగారెడ్డి జర్నలిస్టుల విన్నపం



**రంగారెడ్డి, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల మంజూరు చేయాలని టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా శాఖ డిమాండ్ చేసింది. రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎండీ సలీమ్ పాషా నేతృత్వంలో జర్నలిస్టులు మణికొండలో మంత్రి శ్రీధర్ బాబు, మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌లను కలిసి విన్నపం చేశారు. జర్నలిస్టులు ఎన్నో సంవత్సరాలుగా ప్రజల సమస్యలు, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, అత్యవసర పరిస్థితులను ముందుండి ప్రజలకు చేరవేస్తూ, ప్రజలతో ప్రభుత్వం మధ్య వారధి పాత్రను నిర్వర్తిస్తున్నారని వివరించారు. అయితే, హెల్త్ కార్డులు, ప్రభుత్వ గుర్తింపు కార్డులు, ఇళ్ల స్థలాలు వంటి మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికే పలువురు జర్నలిస్టులు సరైన వైద్య సదుపాయాలు అందక ప్రాణాలు కోల్పోయారని, హెల్త్ కార్డులతో పాటు భీమా సౌకర్యం కల్పించాలని కోరారు. రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన రిపోర్టర్ నర్సింగ్ రావు గుండె పోటుతో స్టార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, తక్షణం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల షాబాద్ మండలానికి చెందిన రిపోర్టర్ రాములు గుండె పోటుతో మృతి చెందారని, వారి కుటుంబానికి ప్రభుత్వం సహాయం అందించాలని కోరారు. ఉద్యోగుల మాదిరిగా జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులు అమలు అయ్యేలా చూడాలని విన్నపం చేశారు. ఈ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. వీటిపై మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో జిల్లా దాడుల నివారణ కమిటీ సభ్యుడు భీమయ్య, సీనియర్ నేతలు సూర్యనారాయణ, రాజేందర్ రెడ్డి, రాజు, విష్ణు, రాము, శేఖర్ రెడ్డి, నరేందర్, బాలు, లక్ష్మీనారాయణ, ఎం. విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## చెన్నైలో 22వ అబాకస్ పోటీలు కరీంనగర్ పిల్లల ప్రతిభ వెలుగులు



**కరీంనగర్, నవంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
చెన్నై నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 22వ అబాకస్ జాతీయ స్థాయి పోటీలలో కరీంనగర్ జిల్లాకు చెందిన ఎస్ఐపీ అబాకస్, కరీంనగర్ సంస్థ నుండి 36 మంది చిన్నారులు పాల్గొన్నారు. వివిధ విభాగాలలో తమ ప్రతిభను ప్రదర్శించి, అందరూ ఉత్తమ ప్రతిభా అవార్డులు అందుకోవడం విశేషం. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన కరీంనగర్ ట్రాఫిక్ సిఐ శ్రీ కుమారస్వామి గారు విజేతలకు సన్మానం చేసి, పిల్లల ధైర్యం, కృషి, ప్రతిభను అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐపీ అబాకస్, కరీంనగర్ నిర్వాహకులు సబితా రెడ్డి, స్వరూపతో పాటు అబాకస్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని వేడుకను విజయవంతం చేశారు. ఈ పోటీలలో కరీంనగర్ చిన్నారులు సాధించిన విజయాలు జిల్లా గర్వకారణంగా నిలిచాయి.

## కె.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ




**కోదాడ, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన సిపిగెట్ 2025 ఫలితాలలో కోదాడ కె.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. షేక్ షాహినా, బండావత్ అల్లాబి ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్‌లో, ఎన్. వీరబాబు గౌడ్, డి. బద్రి కాకతీయ యూనివర్సిటీ, వరంగల్‌లో మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (ఎం.ఎల్.ఐ.ఎస్సీ) విభాగంలో పీజీ సీట్లు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చందా అప్పారావు విద్యార్థులను అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించిన కళాశాల గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకులు, లైబ్రేరియన్ మాతంగి యాకుబ్ మాట్లాడుతూ, లైబ్రరీ సైన్స్ కోర్సు ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ప్రైవేటు రంగంలోనూ అపారమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, ఈ కోర్సు విద్యార్థుల భవిష్యత్తుకు స్థిరత్వాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సైదిరెడ్డి, నందిగామ నిర్మల కుమారి, శ్రీలత, రాజ్యలక్ష్మి, సుమా, సైదమ్మ, సైదులు, వేణుగోపాల్, కళాశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ విజయాలు కళాశాల ప్రతిష్టను మరింత పెంచుతూ, విద్యార్థుల కృషి, అధ్యాపకుల మార్గదర్శకతకు నిదర్శనంగా నిలిచాయి.

## అచ్చంపేట ఎస్సై సద్దాం హుస్సేన్‌కు కాంగ్రెస్ నాయకుల సన్మానం



**అచ్చంపేట, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అచ్చంపేట పట్టణ కేంద్రంలో ఇటీవల నూతన బాధ్యతలు చేపట్టిన ఎస్సై సద్దాం హుస్సేన్‌ను స్థానిక పోలీస్ స్టేషన్లో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఐఎన్‌టీయూసి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసి తాలూకా అధ్యక్షుడు మహబూబ్ అలీ, ఐఎన్‌టీయూసి అచ్చంపేట టౌన్ అధ్యక్షుడు ఎండీ గౌస్ పాష, ఐఎన్‌టీయూసి మండల ఉపాధ్యక్షుడు మౌలానా, సేవాదళ్ తాలూకా అధ్యక్షుడు జగదీశ్వర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సన్మానం సందర్భంగా ఎస్సై సద్దాం హుస్సేన్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రజాసేవలో ఆయన విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

## "హలో మాల - చలో ఢిల్లీ" కరపత్రాల ఆవిష్కరణ



**కల్వకుర్తి, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మానాడు పిలుపుమేరకు "హలో మాల చలో ఢిల్లీ" కరపత్రాలను ఆవిష్కరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా మాల మహానాడు ఉపాధ్యక్షుడు రావుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, నవంబర్ 26న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరగనున్న భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ సభకు కల్వకుర్తి ప్రాంతం నుండి అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రావుల శ్రీనివాసులు మాట్లాడుతూ, మాలల డిమాండ్లను స్పష్టంగా వివరించారు. పార్లమెంటుకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టాలని, మాల మహార్ అనుబంధ కులాల అభివృద్ధి కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. శాస్త్రీయ లెక్కలు లేకుండా చేసిన వర్గీకరణలో జీవో నెంబర్ 99, జీవో నెంబర్ 29 రాజ్యాంగ వ్యతిరేకమని, వాటిని తక్షణమే పునఃసమీక్షించాలని తెలిపారు. అలాగే ప్రైవేట్ రంగాలలో రిజర్వేషన్ తీసుకురావాలని, ఎస్సీ రిజర్వేషన్లను 15% నుండి 20% పెంచాలని, దళితులపై దాడులను అరికట్టాలని, ఎస్సీ ఎస్టీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయస్థానాలు, రాజ్యసభలో రిజర్వేషన్ అమలు చేయాలని, భారత రాజ్యాంగాన్ని అన్ని ప్రాంతీయ భాషల్లో విద్యార్థులకు అందించాలన్నారు.
కరెన్సీపై డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఫోటో ముద్రించాలని, బ్యాగరి మరియు కాటికాపరిలకు జాతీయ స్థాయిలో గుర్తింపు ఇవ్వాలని, గౌరవ వేతనం అందించాలని, ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తలకు కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల సహకారాలు అందించాలన్నారు. రాజ్యాంగ పీఠికను ప్రతి ప్రార్థనలో తప్పకుండా చదివేలా చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాయిని శంకరయ్య, డివిజన్ కార్యదర్శి సామ బాలరాజు, తాలూకా కార్యదర్శి ఆంజనేయులు, సామ శేఖర్, పంజాగుల గ్రామ అధ్యక్షుడు షాంపూరి వెంకటేష్, గోరటి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్పీఎల్-6 పోస్టర్ ఆవిష్కరణ గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం



**నల్లగొండ, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నల్గొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో ఈ నెల 28 నుంచి డిసెంబర్ 12 వరకు కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరగనున్న ఎన్పీఎల్-6 టోర్నమెంట్ పోస్టర్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సెక్రటేరియట్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ రెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టోర్నమెంట్‌కు అన్ని విధాలుగా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఇలాంటి క్రీడలు గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు ఎంతో దోహదం చేస్తాయని, వారి ప్రతిభను వెలికితీయడానికి వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. నల్గొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ రెడ్డి మాట్లాడుతూ మట్టిలో మాణిక్యాలను వెలికి తీయడానికి ఇలాంటి క్రీడలు ఎంతో ఉపయుక్తమని, క్రీడాకారులంతా ఈ టోర్నమెంట్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. టోర్నమెంట్ విజేతలకు మొదటి బహుమతిగా రూ. 2,22,222, ద్వితీయ బహుమతిగా రూ. 1,11,111 అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఆంగోతు ప్రదీప్ నాయక్, కేసాని వేణుగోపాల్ రెడ్డి, నిర్వాహకులు బోనగిరి ప్రభాకర్, ముత్తినేని నాగేశ్వరరావు, పాలకూరి శ్రీధర్, గంజి గిరి, కోమటిరెడ్డి శేఖర్ రెడ్డి, సాయి, చిన్ని రంగ, మధు, నవీన్ రెడ్డి నాని తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా గాంధీ మహిళా శక్తికి చిరస్మరణ

- అంజన్ రెడ్డి



**వనపర్తి,నవంబర్ 19 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
దేశానికి రాజకీయ స్థైర్యం, మహిళలకు ఆత్మవిశ్వాసం అందించిన నేత ఇందిరా గాంధీని ఈ తరం మరవలేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతకుంట అంజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ రాజకీయ పటంలో భారతకు ప్రత్యేక గుర్తింపు తెచ్చింది ఇందిరా గాంధీ నాయకత్వమేనని, ఆమె ధైర్యం, నిర్ణయసామర్థ్యం ప్రతి భారతీయ మహిళకు శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తోందని పేర్కొన్నారు. "ఇందిరా అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటే ఇందిరా ఈ భావన ప్రజల హృదయాల్లో ఇంకా నిలిచే ఉంది" అని అన్నారు. మహిళా సాధికారతకు, పేదల సంక్షేమానికి, దేశ బలపాటుకు ఆమె తీసుకున్న నిర్ణయాలు నేటి ప్రభుత్వాలకు కూడా మార్గదర్శకాలని అంజన్ రెడ్డి పేర్కొన్నారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమె ఆశయాలను, ఆమె దేశసేవా స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని అంజన్ రెడ్డి పిలుపునిచ్చారు.

## పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కేసు నమోదు చేస్తాం: ఎస్సై రాజిరెడ్డి

**కనగల్లు, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కనగల్ మండలం స్టేషన్ పరిధిలో ఆటో డ్రైవర్ల అందరికీ మండల పోలీస్ స్టేషన్ ఎస్ఐ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే వాహనదారులపై కఠిన చర్యలు మరియుకేసులు నమోదు చేస్తామని కనగల్ ఎస్సై రాజిరెడ్డి హెచ్చరించారు. కనగల్ ఎక్స్ రోడ్ వద్ద ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వచించాడు. వాహనాలు రిజిస్ట్రేషన్ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఇన్సూరెన్స్,పత్రాలను తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని తెలిపారు.



# ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



**బోడుప్పల్, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారత మాజీ ప్రధాని స్వర్గీయ శ్రీమతి ఇందిరా గాంధీ 107వ జయంతి సందర్భంగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఇందిరా నగర్ కాలనీలో ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ హాజరై, కేక్ కట్ చేసి వేడుకలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి విశ్వం గుప్త, మాజీ కార్పొరేటర్లు గుర్రాల రామ వెంటేష్ యాదవ్, బొమ్మక్ కళ్యాణ్, భూక్యా సుమన్ నాయక్, సీసా వెంకటేష్ గౌడ్, జె రాములు, పులకండ్ల జంగారెడ్డి, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, డీ జానీ, గోపు రాములు, మహిళా నాయకులు యాదమ్మా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జిల్లా స్థాయి బాలుర క్రికెట్ పోటీలు



**మెదక్, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి 17 సంవత్సరాల లోపు బాలుర క్రికెట్ పోటీలు బుధవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ప్రారంభోత్సవంలో ఇరు జట్లకు టాస్ వేసి పోటీలను ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేశారు.
ముగింపు కార్యక్రమానికి స్థానిక పార్లమెంట్ సభ్యుడు ఎం. రఘునందన్ రావు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం క్రీడాకారులతో సరదాగా కొద్దిసేపు క్రికెట్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ, ఉమ్మడి మెదక్ జిల్లా నుండి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన తిలక్ వర్మను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థి క్రీడాకారులు క్రీడల్లో ముందుకు సాగాలని సూచించారు. అలాగే వచ్చే నెలలో జరగనున్న మెదక్ పార్లమెంట్ స్థాయి సంసాద్ ఖేలో మహోత్సవం విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు, నిర్వాహకులు సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు.

# అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో పాల్గొన్నఅదనపు కలెక్టర్ డి. వేణు



**పెద్దపల్లి, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం జరిగింది. అదనపు కలెక్టర్ డి. వేణు పాల్గొని వృద్ధుల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. వృద్ధులు కుటుంబానికి మార్గదర్శకులు అని, బ్యాంకుల్లో ప్రత్యేక సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ, స్నేహపూర్వకంగా ఉండాలని, సీనియర్ సిటిజన్స్ సంరక్షణ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వృద్ధులు తమ సమస్యలు, సూచనలు తెలియజేశారు. అనంతరం అదనపు కలెక్టర్ వృద్ధులను సన్మానించారు.

# జూలపల్లిలో ప్రధాన రోడ్డు పనులు వెంటనే చేపట్టాలి

## - బీజేపీ డిమాండ్



**పెద్దపల్లి, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జూలపల్లి మండల కేంద్రంలోని మందోటా పోలీస్ స్టేషన్ చౌరస్తా కుర్మపల్లి వరకు వెళ్లే ప్రధాన రోడ్డు గత పది సంవత్సరాలుగా శిథిలమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు అమరగాని ప్రదీప్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి, రోడ్డు నిర్మాణం వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా, ఎమ్మెల్యేలు మారినా జూలపల్లి పరిస్థితి మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత, ప్రస్తుత ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడంతో ప్రజలు దశాబ్దకాలంగా ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డు, పెద్దపల్లి –జూలపల్లి డబుల్ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని, లేని పక్షంలో నిరాహార దీక్షలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భూసారపు రవీందర్ గౌడ్, కొమ్మ ఐలయ్య, తీగల అశోక్ గౌడ్, దొడ్ల రాజయ్య, కంచి శ్రీనివాస్, మేరుగు కనకయ్య, పెసరు రాజు, అమరగాని ఎల్లేష్, వేణు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అబ్దుల్లాపూర్ మెట్‌లో వరి ధాన్యం కేంద్రాలపై అకస్మాత్తు తనిఖీలు



**అబ్దుల్లాపూర్ మెట్, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి ఉష, మండల వ్యవసాయ అధికారి పల్లవి, అసిస్టెంట్ అధికారి రఘుపతితో కలిసి బండ రావిరాల గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈరోజు ఉదయం అకస్మాత్తుగా తనిఖీ చేశారు. రైతులకు అందుతున్న సౌకర్యాలు, ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. తరువాత అబ్దుల్లాపూర్ మెట్ మండల రైతు వేదిక కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోడీ పీఎం కిసాన్ 21వ బడ్జెట్‌ను టెలికాన్ఫరెన్స్ ద్వారా రైతుల ఖాతాల్లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఉష, పల్లవి, రఘుపతి, అసిస్టెంట్ అధికారి వెంకటేష్‌తో పాటు అన్ని గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# దేశానికి ఇందిరా సేవలు చిరస్మరణీయం సిహెచ్ యాదయ్య



**తుక్కుగూడ, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలో ఇందిరా గాంధీ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మహేశ్వరం నియోజకవర్గ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య మాట్లాడుతూ, భారతదేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీర వనిత ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రధానిగా ఆమె అందించిన స్ఫూర్తిదాయకమైన పాలన దేశానికే కాకుండా ప్రపంచానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఇందిరా గాంధీ భారతీయ మహిళా శక్తికి ధైర్యసాహసాలకు ప్రతీక అని, ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని భారతదేశాన్ని ప్రపంచ పటంలో శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దారని యాదయ్య తెలిపారు. ఆమె నాయకత్వంలో భారతదేశం అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటిందని, ప్రపంచ దేశాలు భారతదేశాన్ని గౌరవించే స్థాయికి చేర్చిందని అన్నారు. ప్రజల సంక్షేమం, దేశ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన ఇందిరా గాంధీ సేవలను తరతరాలు గుర్తు చేసుకుంటూ నడుచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుచరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డలందరికీ ప్రభుత్వ చీరెలు - కిచ్చెన్న



**మహేశ్వరం, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్న లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఆడబిడ్డలందరికీ చీరెలు పంపిణీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షనీయమని అన్నారు. ఇందిరాగాంధీ 108వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చీరెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారని, ఈ కార్యక్రమం డిసెంబర్ 9వ తేదీ తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం వరకు కొనసాగుతుందని తెలిపారు. తెల్ల రేషన్ కార్డులు కలిగిన కుటుంబాల్లో ప్రతి ఆడబిడ్డకు మహిళా సమాఖ్య ద్వారా చీరెలు అందజేస్తామని లక్ష్మారెడ్డి వివరించారు. ఇప్పటివరకు మహిళలకు రూ. 27 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను అందించామని గుర్తు చేశారు. ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం, విద్యుత్, రూ. 500 గ్యాస్ సిలిండర్, సోలార్ పవర్, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు వంటి పథకాల ద్వారా మహిళా సాధికారత కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని కేఎల్ఆర్ పేర్కొన్నారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో అనేక పథకాల్లో భాగస్వామ్యం చేస్తున్నామని కిచ్చెన్న లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు.

# నాలాల పనులను వేగవంతం చేయండి

## సబితా ఇంద్రారెడ్డి ఆదేశాలు



**బాలాపూర్, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని జలపల్లి మున్సిపాలిటీ నబిల్ కాలనీలో నత్తనడకన సాగుతున్న ఎస్ఎన్‌డిపి నాలా పనులను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు. కాలనీలో చాలాకాలంగా మురుగు, వర్షపు నీటి సమస్యలతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్న తరుణంలో, పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయో సమగ్రంగా సమీక్షించాలని ఆమె అధికారులకు సూచించారు. ఎస్ఎన్‌డిపి నాలా పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని, తక్షణమే సిబ్బందిని పెంచి పనుల వేగాన్ని పెంచాలని సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. సమస్య పరిష్కారానికి పర్యవేక్షణను కట్టుదిట్టం చేసి, రోజువారీ పురోగతిని రిపోర్ట్ చేయాలని విభాగాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జలపల్లి మున్సిపాలిటీ కమిషనర్ వెంకటరామ్, డీఈ, ఏఈ, ఎస్ఎన్‌డిపి విభాగాధికారులు, బిఆర్ఎస్ నాయకులు సురెడ్డి కృష్ణారెడ్డి, అబ్దుల్లా, నబిల్ కాలనీ నివాసులు పాల్గొన్నారు.

# మెదక్‌లో అభివృద్ధి సంక్షేమ పథకాలపై దిశా సమీక్షా సమావేశం

**మెదక్, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు మానిటరింగ్ కమిటీ (దిశ) సమీక్షా సమావేశం ఈరోజు జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు అధ్యక్షత వహించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, డిఆర్ఓ భుజంగరావు, డిఆర్డిఓ శ్రీనివాసరావు సహా అనేక శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో కేంద్ర -రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతి, వీటి అమలులో ఎదురవుతున్న సమస్యలు, బడ్జెట్ వినియోగం, లబ్ధిదారుల ఎంపిక, నిధుల పంపిణీ వంటి అంశాలను సమీక్షించారు. గత సమావేశంలో చేసిన సిఫారసులపై తీసుకున్న చర్యల గురించి విస్తృతంగా చర్చ జరిగింది. ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలపై ఫీల్డ్ లెవల్ మానిటరింగ్ పెంచాలని, ప్రయోజనాలు నిజమైన లబ్ధిదారులకు




చేరేలా కృషి చేయాలని, జిల్లా స్థాయిలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశ సంబంధిత ప్రోసీడింగ్స్ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరచాలని అధికారులను ఆదేశించారు. మెదక్ జిల్లాలో కొత్త క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఎంపీ తెలిపారు. జిల్లా కలెక్టర్ చొరవతో వెయ్యి గజాల స్థలం కేటాయించేందుకు చర్యలు జరుగుతున్నాయని చెప్పారు. దేశంలోని 736 జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా, మెదక్‌లో తొలి ప్రిలిమినరీ క్యాన్సర్ టెస్టింగ్ కార్యక్రమం ప్రారంభమవుతుందని వెల్లడించారు. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సంస్థ సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ. 69.59 లక్షల విలువైన క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సు అందిస్తోంది. ఈ బస్సు సహాయంతో ప్రతి మండల కేంద్రంలోని హై స్కూల్ ఆవరణలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహించనున్నారు. ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి. సమావేశంలో నేషనల్ హైవే 765 డీజీ రోడ్డుకు సంబంధించిన అటవీ శాఖ అనుమతులు, గుమ్మడిదల నర్సాపూర్ ఎలివేటెడ్ కారిడార్ డీపీఆర్, ఇతర పెండింగ్ మౌలిక సదుపాయాల అంశాలపై కూడా చర్చ జరిగింది. ఈ సమావేశం ద్వారా మెదక్ జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం సమిష్టి కృషి మరింత బలపడింది.

## ఇందిర మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలి

-జిల్లా కలెక్టర్ :ఇలా త్రిపాఠి



**నల్లగొండ, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుండి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ,సహచర మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావుల తో కలిసి ఇందిర మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమం పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులు గా తీర్చిదిద్దేందుకు అన్ని రకాలుగా అవకాశాలు కల్పిస్తున్నదని, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఐక్యతతో ఉండి వాటిని సద్వినియోగం చేసుకోవాలని ,రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఇందిర మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## సంక్షేమ హాస్టల్లో ఉండే విద్యార్థులకు చలికి తట్టుకునే రగ్గులు పంపిణి చేయాలి

-బిఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా ఉపాధ్యక్షుడు బుడిగ వెంకటేష్.




**దేవరకొండ నవంబర్ 19. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** దేవరకొండ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పెంచికల్ పాడ్ పాఠశాలలో ఎస్ఎఫ్ఐ సభ్యత్వం కార్యక్రమం నిర్వహించి ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా ఉపాధ్యక్షుడు బుడిగ వెంకటేష్ మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టల్లో ఉండే విద్యార్థులను గాలి వదిలేశారని అన్నారు చేశారు. హాస్టల్లో ఉండే ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ, కస్తూర్బా గాంధీ విద్యార్థులను పట్టించుకునే నాథుడే కరువయ్యారని పేద విద్యార్థుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడడం సరైంది కాదని ఆవేదన వ్యక్తం చేశారు.సంక్షేమ హాస్టల్లో విద్యార్థులు చలికాలం గజగజ వనికిపోతున్న విద్యార్థులకు అందించాల్సిన రగ్గులు ఈయకపోవడం వలన ఇంటి దగ్గర నుంచి తెచ్చుకొని నెట్టుకోస్తున్న పరిస్థితి కనిపిస్తున్నప్పటికీ కూడా అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరించడం సరైనది కాదని అన్నారు.తక్షణమే నల్గొండ జిల్లా కలెక్టర్ ప్రభుత్వంతో మాట్లాడి ఎస్సీ, ఎస్టీ,బీసీ, సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు మరియు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఉండే విద్యార్థులకు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు చలికి తట్టుకునే దుప్పట్లను,రగ్గులు మరియు విద్యార్థులకు ఉన్ని స్వెటర్లు అందించే విధంగా ప్రభుత్వంతో గాని,లేదంటే జిల్లా కలెక్టర్ స్పెషల్ గ్రాంట్ తో గాని పేద మధ్య తరగతి విద్యార్థులను తీవ్రమైన చలి నుండి కాపాడాలని విద్యార్థుల తరఫున కలెక్టర్ కి విజ్ఞప్తి చేస్తున్నాం. అని అన్నారు,తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా పేద,మధ్యతరగతి విద్యార్థులందరికీ గత ప్రభుత్వ మాదిరిగా రగ్గులను స్వెటర్లను అందించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేయడం చేస్తుందని లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు,రామలింగం, అరుణ్,అభి,నవీన్,నరసింహ,శివ,అనిల్,అయాన్,అభిషేక్,గణేష్,హరిబాబు,ప్రణిత,పూజశ్రీ,దీపిక,కీర్తన,లిఖిత ,బ్రాహ్మణి,అనూష దేవిశ్రీ బ్రాహ్మణి అనూష, మల్లేష్, రాజేష్, గణేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుతోనే అన్ని సాధ్యం జిల్లా కలెక్టర్ :ఇలా త్రిపాఠి



**నల్లగొండ ,నవంబర్ 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఈనెల 14 నుండి 20 వరకు నిర్వహిస్తున్న 58 వ "జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో" భాగంగా బుధవారం ఆమె నల్గొండ జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో కష్టపడి ఇందిరాగాంధీ ప్రధాని అయ్యారని, పేద ప్రజల సంక్షేమానికి "గరీబి హఠావో" నినాదాన్ని తీసుకువచ్చారని, ఆమెకు అనేక భాషలలో ప్రావీన్యురాలని, తండ్రి జవహర్లాల్ నెహ్రూ ప్రధాని అయినప్పటికీ ఆమె స్వయంగా కష్టపడి ప్రధానమంత్రి అయ్యారని, ఇందిరాగాంధీ లాగా కష్టపడి చదివి సమాజంలో మంచి స్థానానికి రావాలని ఆమె విద్యార్థినిలకు పిలుపునిచ్చారు.

## షీ టీమ్స్ -మహిళ భద్రతకు ఆపన్న హస్తం



**పెద్దపల్లి, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి షీ టీమ్ ఆధ్వర్యంలో గోదావరిఖని శ్రీనగర్ కాలనీలోని గౌతమి ఐటీఐ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. షీ టీమ్ ఇంచార్జ్ ఎస్ఐ లావణ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యువతులు భద్రంగా, నిస్సంకోచంగా జీవించేలా తెలంగాణ పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన షీ టీమ్స్ లక్ష్యాలు, చర్యలు వివరించారు.మహిళలపై జరిగే ఈవ్‌టీజింగ్, హరాస్మెంట్, స్టాకింగ్, సోషల్ మీడియా వేధింపులు వంటి ఘటనలను అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ లావణ్య మాట్లాడుతూ మహిళల భద్రతతో పాటు ఆన్లైన్ మోసాలు, డ్రగ్స్ మరియు చెడు అలవాట్లకు అబ్బాయిలు దూరంగా ఉండాలని సూచించారు. అమ్మాయిల జోలికి వెళితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పబ్లిక్ ప్రదేశాలు, పాఠశాలలు, కాలేజీలు, బస్ స్టాండ్లు, మార్కెట్లలో గస్తీ, మొబైల్ పట్రోలింగ్‌తో పాటు సోషల్ మీడియా ద్వారా వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురైతే మహిళలు, విద్యార్థులు భయపడకుండా డయల్ 100 లేదా షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 6303923700కు ఫోన్ చేసి సమస్య తెలియజేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు.అలాగే సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు, లోన్ యాప్స్ వంటి వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నా, బెదిరింపులు ఎదురైనా వెంటనే 100 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో షీ టీమ్ సభ్యులు మౌనిక, సురేష్, స్నేహలత, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని ఉక్కు మహిళా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

-బిఎన్ ఎస్ యు ఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.



**దేవరకొండ నవంబర్ 19. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** దేవరకొండ పట్టణంలో ఎన్ ఎస్ యు ఐ జాతీయ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పానుగంటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో భారతదేశానికి అపూర్వ సేవలు అందించిన మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళగా నిలిచిన శ్రీమతి ఇందిరా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ దేశ నిర్మాణంలో చేసిన కృషి, పేదల సంక్షేమానికి చేపట్టిన విప్లవాత్మక కార్యక్రమాలు, దేశ భద్రత అభివృద్ధికి చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ఆమె నాయకత్వం భారత యువతకు స్ఫూర్తి ప్రదాయకమని పేర్కొన్నారు.ఎన్ ఎస్ యు ఐ నాయకులు, విద్యార్థి సంఘ ప్రతినిధులు పాల్గొని, ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. యువతలో ప్రజాస్వామిక విలువలు, దేశభక్తి, సేవాస్ఫూర్తి పెంపొందించే దిశగా ఇందిరా గాంధీ జీవితం మార్గదర్శకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వంగూరి వెంకటేశ్వర్లు, యేకుల అంబేద్కర్, యం.డి.ఇమ్రాన్, పొట్ట ప్రభు, నాగటి హరీష్ యుగేందర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



**పెద్దపల్లి, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 107వ జయంతి సందర్భంగా పెద్దపల్లి పట్టణ కేంద్రంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. గౌరవ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ, భారతదేశానికి మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రిగా ఎన్నికై దేశానికి ఎనలేని సేవలు చేసిన ఇందిరా గాంధీ నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు, భూములు పంచి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

## పంట అవశేషాలు కాల్చకండి

-వ్యవసాయ అధికారుల హెచ్చరిక





**పెద్దపల్లి, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పంట చేలల్లో అవశేషాలను కాల్చడం వలన నేల భూసారం తగ్గిపోవడంతో పాటు పర్యావరణానికి తీవ్ర దుష్ప్రభావాలు కలుగుతాయని పెద్దపల్లి మండల వ్యవసాయ అధికారి కాంతాల అలివేణి రైతులకు సూచించారు.ఆమె మాట్లాడుతూ పంట అవశేషాల దహనం వలన భూమిలో ఉండే సూక్ష్మక్రిములు, వానపాములు వంటి రైతు నేస్తం జీవులు నశిస్తాయని, పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోవడంతో భూమి పోషకాలు నిరుపయోగంగా మారుతాయని తెలిపారు. విద్యుత్ లైన్ల కింద అవశేషాలను కాల్చడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు.సారవంతమైన మృత్తిక ఏర్పడటానికి వేల సంవత్సరాలు పడుతుందని, కానీ అవశేషాలను కాల్చడం వలన వెంటనే మృత్తిక క్రమక్షయం జరుగుతుందని అన్నారు. ఉష్ణోగ్రతలు పెరగడం వలన పంట ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించారు.రైతులు అవశేషాలను కాల్చకుండా పంటను కలియదున్ని వేస్ట్ డీకంపోజర్ వినియోగిస్తే అవశేషాలు త్వరగా కుళ్లిపోతాయని, తద్వారా పంటలకు కావలసిన పోషకాలు అందుతాయని, రసాయనిక ఎరువుల వినియోగం తగ్గుతుందని తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి ఇది ఉత్తమ మార్గమని వ్యవసాయ అధికారి అలివేణి స్పష్టం చేశారు.

## 1.80 కేజీల నల్లబెల్లం పట్టివేత



**దేవరకొండ నవంబర్ 19. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** నల్ల బెల్లం మరియు పటిక రవాణాకు సంబంధించిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా, ఎస్ హెచ్ ఓ దేవరకొండ బృందం చెన్నారం నుండి కొండమల్లేపల్లికి వెళ్లే రహదారిలోని చెన్నారం గేట్ వద్ద రూట్ వాచ్ నిర్వహించింది. రూట్ వాచ్ సమయంలో, ఒక ఫోర్ వీలర్, రిజిస్ట్రేషన్ నంబర్. TS 08 యుఏ 2909 గల వాహనం లో 1800 కిలోలు గల నల్లబెల్లం 60 సంచులలో ఒక సంచిలో 30 కేజి లు గా నల్ల బెల్లం పటిక అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు మీద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ హెచ్ ఓ శ్రీనివాస్ తెలిపారు.

# కరీంనగర్‌లో ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

**కరీంనగర్, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాజీ ప్రధాని, ఉక్కు మహిళ భారతరత్న ఇందిరా గాంధీ జయంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డిసిసి కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి నగర కాంగ్రెస్ అధ్యక్షులు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, పిసిసి కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అవకారపు భాస్కర్ రెడ్డి హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తరువాత ఇందిరా చౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నేతలు విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గరీబి హటావో నినాదంతో పేదలకు కూడు, గూడు, బట్ట కల్పించిన ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయమని, బ్యాంకుల జాతీయకరణతో పాటు అనేక సంస్కరణలు



తీసుకువచ్చి దేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలిపారని కొనియాడారు. నేటి రాష్ట్రంలో పేదల కోసం కాంగ్రెస్ పార్టీ 'ఇందిరమ్మ ఇల్లు' నిర్మాణం కొనసాగుతుందని, ఆమె చూపిన మార్గంలో సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఉక్కు సంకల్పంతో ముందుకు సాగిన ఇందిరా గాంధీని ఆదర్శంగా తీసుకుని నేటి మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని నేతలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బానోతు శ్రావణ్ నాయక్, చర్ల పద్మ, అహ్మద్ అలీ, కుర్ర పోచయ్య, మడుపు మోహన్, కంకణాల అనిల్ కుమార్, వంగల విద్యాసాగర్, అబ్దుల్ రెహమాన్, ముస్తాక్ హైమద్, పొన్నం మధు, సలీముద్దీన్, నాగుల సతీష్, సుంకరి గణపతి, మూల జయపాల్, మహ్మద్ ఆమెర్, మహమ్మద్ చాంద్, షబానా మహమ్మద్, నెల్లి నరేష్, జొన్నల రమేష్, రాచర్ల పద్మ, గడ్డం శ్రీరాములు, వసీం, అజ్మత్ హుస్సేన్, జూపాక సుదర్శన్, గంగుల దిలీప్, తోట అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్బన్ నక్సల్స్‌పై బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు

**హుజూరాబాద్, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుజూరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అర్బన్ నక్సల్స్ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమాయక దళిత, గిరిజన, ఆదివాసీలను రెచ్చగొట్టి నక్సలైట్లుగా మార్చి వారి ప్రాణాలను బలిగొనడానికి అర్బన్ నక్సల్స్ బాధ్యత వహించాల్సిందేనని ఆయన అన్నారు. అమాయక నక్సలైట్లు అడవుల్లో చనిపోతుంటే, అర్బన్ నక్సల్స్ మాత్రం ఆస్తులు కూడగట్టి ప్రభుత్వ నామినేటెడ్, కమిషన్ పదవుల్లో కొనసాగుతున్నారని మండిపడ్డారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడటమే తమ సిద్ధాంతమని చెప్పుకునే వారు



కాంగ్రెస్ ప్రభుత్వంలో పదవులు ఎందుకు అనుభవిస్తున్నారని ప్రశ్నించారు. మావోయిజానికి బీజేపీ ఎప్పటికీ వ్యతిరేకమని, తుపాకీ గొట్టం ద్వారా రాజ్యాధికారం సాధ్యం కాదని, ప్రజలు అంగీకరించరని స్పష్టం చేశారు. అమాయకుల చావుకు అర్బన్ నక్సల్స్ బాధ్యత వహించాలన్నారు. మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలతో భారత్‌ను ఆర్థిక ప్రగతిలో నాలుగో స్థానానికి చేర్చిందని, విదేశాధి నేతలే మోదీకి సాష్టాంగపడుతున్నారని పేర్కొన్నారు. అడవుల్లో ఉన్న నక్సలైట్లకు విజ్ఞప్తి చేస్తూ, అర్బన్ నక్సల్స్ మాటలు నమ్మి మోసపోవద్దని, లొంగిపోతే ప్రభుత్వాలు పూర్తి సాయం అందిస్తాయని తెలిపారు. వచ్చే మార్చి నాటికి మావోయిజాన్ని పూర్తిగా అంతం చేస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.

## పార్క్ స్థలాల రక్షణ, పన్నుల భారంపై సర్దార్ రవీందర్ సింగ్ ఆగ్రహం



**కరీంనగర్, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కేసీఆర్ హయాంలో కరీంనగర్ నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దామని, ప్రజలకు అన్ని రంగాల్లో అభివృద్ధి పనులు అందుబాటులోకి వచ్చాయని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం ప్రజా పాలన పేరుతో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మహాత్మా జ్యోతిబాపులే పార్కులోని 4 గుంటల స్థలాన్ని విద్యుత్ శాఖకు కేటాయించడం ప్రజల అభిప్రాయాలు సేకరించకుండా, నిబంధనలు ఉల్లంఘించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. పార్క్ స్థలాలను కేవలం స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులకు మాత్రమే వినియోగించాలనీ, ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా ఊరుకోబోమని హెచ్చరించారు. అవసరమైతే హైకోర్టులో పిల్ దాఖలు చేస్తామని తెలిపారు. పన్నుల పేరుతో ప్రజలపై అధిక భారాన్ని మోపుతున్నారని మండిపడ్డారు. మున్సిపల్ కార్పొరేషన్ కొత్త సర్క్యులర్ ద్వారా ప్రతి ఇంటి నుంచి నెలకు రూ.60 వసూలు చేస్తూ, సుమారు రూ.60 లక్షల పైగా సొమ్ము కాజేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి కమిటీ లేకుండా, ప్రజలకు తెలియజేయకుండా అధికారులు ఇష్టానుసారంగా రేట్లు ఫిక్స్ చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు ఇప్పటికే పన్నులు చెల్లిస్తున్నా, శానిటైజేషన్ పేరుతో కొత్త వసూళ్లు చేయడం అన్యాయమని ప్రశ్నించారు. వెంటనే మహాత్మా జ్యోతిబాపులే పార్క్ స్థల కేటాయింపుకు సంబంధించిన జీవో ఉపసంహరించుకోవాలని, శానిటైజేషన్ పన్ను రద్దు చేయాలని జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌ను కోరారు.

## అక్కన్నపేటలో ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



**అక్కన్నపేట, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత దేశ మాజీ ప్రధాని, ఉక్కు మహిళా ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా అక్కన్నపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జంగపెల్లి ఐలయ్య నేతృత్వంలో పార్టీ శ్రేణులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ దేశం కోసం సర్వస్వం ధారపోసిన మహనీయురాలు ఇందిరా గాంధీ రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయాకరణ వంటి విప్లవాత్మక నిర్ణయాలతో దేశ ప్రగతికి, పేదల అభ్యున్నతికి విశేష కృషి చేశారని అన్నారు. గరీబి హఠావో నినాదంతో పేదరిక నిర్మూలనకు కృషి చేసి, 20 సూత్రాల పథకాలతో ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టిన దిశారి అని కొనియాడారు. ధైర్యసాహసాలతో ప్రతిపక్షాల చేత కూడా దుర్గామాతగా కీర్తింపబడిన వీరవనిత దేశం కోసం ప్రాణత్యాగం చేసిన తొలి మహిళా ప్రధానమంత్రిగా చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దాము లింగంపల్లి, సారయ్య బందరం రాజయ్య, బెజ్జంకి సారయ్య, మోహన్ నాయక్, సామి రెడ్డి, చింతల బాలరాజ్, పులికాసి రమేష్, వల్లపు పరశురాములు, ధరవత్ తిరుపతి నాయక్, అనిల్ కుమార్, నందవరం సంపత్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా విద్యార్థినిలకు పంపిణీ కార్యక్రమం

**తుక్కుగూడ, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సమత ప్రకాష్ ఆధ్వర్యంలో తుక్కుగూడ హైస్కూల్‌లో ఘనంగా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రంగా రెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్ ఇందిరా గాంధీ దేశ ప్రయోజనం కోసం



రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయాకరణ వంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని పేదల అభ్యున్నతికి కృషి చేసిన తొలి మహిళా ప్రధానమంత్రిగా కొనియాడారు. కార్యక్రమంలో విద్యార్థినిలకు బ్లాంకెట్స్, సానిటరీ ప్యాడ్స్, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ వేడుకలో బడంగ్‌పేట్ అధ్యక్షురాలు అమృత నాయుడు, ప్రభావతి, నజీం బేగం, బస్సు మీనాక్షి స్కూల్ యాజమాన్యం, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## టిడిపి నేత ఆగయ్య, ఫార్వర్డ్ బ్లాక్ నేత సురేందర్ రెడ్డి కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



**కరీంనగర్, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, ఎన్టీఆర్ వీరాభిమాని కళ్యాణపు ఆగయ్య అకాల మరణం నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని మానకొండూరు ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. ఆగయ్య చిత్రపటానికి నివాళులు అర్పించి, ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. చివరి శ్వాస వరకు టిడిపిలో కొనసాగిన ఆగయ్య మంచి మనసున్న వ్యక్తిగా స్మరించుకున్నారు. అలాగే హౌసింగ్ బోర్డ్ కాలనీలో అనారోగ్యంతో కన్నుమూసిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి బండ సురేందర్ రెడ్డి కుటుంబాన్ని కూడా డా. సత్యనారాయణ పరామర్శించారు. రాష్ట్రస్థాయిలో ఫార్వర్డ్ బ్లాక్ నిర్మాణం కోసం సురేందర్ రెడ్డి చేసిన కృషి మరువలేనిదని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు గోపు మల్లారెడ్డి, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతి గోపి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## శాతవాహన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**కరీంనగర్, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నేటి డిజిటల్ యుగంలో అసంబద్ధ జీవనశైలితో పలు రుగ్మతలు పెరుగుతున్నాయని శాతవాహన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దాసరి తిరుపతి రెడ్డి అన్నారు. రెనీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో స్థానిక ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఉచిత బిపీ, మధుమేహ పరీక్షల శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య రక్షణ కోసం తమ క్లబ్ వివిధ పార్కులు, ఆట స్థలాల్లో ఇలాంటి శిబిరాలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, పూర్వ అధ్యక్షులు లయన్ రాంమోహన్ రావు, కార్యదర్శి లయన్ చంద్రశేఖర్, కోశాధికారి లయన్ పచ్చునూరి సురేందర్, సభ్యులు లయన్ ఎం. సత్యనారాయణ రావు, ప్రతాప్ రావు, కె. నారాయణ రెడ్డి, సి. నారాయణ, ఎం. రాజిరెడ్డి, ఎన్. వేణుగోపాల్, ఎస్. తిరుపతి రెడ్డి, జి. రవిందర్ తో పాటు రెనీ ఆసుపత్రి టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ శిబిరంలో దాదాపు 150 మందికి బిపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు.

## ప్రకృతిని ప్రశ్నించడమే శాస్త్రానికి పునాది

**- డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**



**కరీంనగర్, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆకులు ఎందుకు పచ్చగా ఉంటాయి, రక్తం ఎందుకు ఎర్రగా ఉంటుంది, సముద్ర జలానికి నీలి రంగు ఎందుకు వస్తుంది, ఇంద్రధనుస్సు ఎలా ఏర్పడుతుంది వంటి ప్రశ్నలు వేసినప్పుడు వాటికి సమాధానం వైజ్ఞానిక శాస్త్రం ఇస్తుందని విశ్రాంత ప్రిన్సిపాల్, రచయిత డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. కరీంనగర్ పట్టణంలోని వసంత వ్యాలీ హైస్కూల్‌లో 9, 10వ తరగతి విద్యార్థులతో సైన్స్ అంశాలపై మాట్లాడిన ఆయన, క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవర్చుకున్న విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించగలరని సూచించారు. చదువుతో పాటు సంస్కారం, విద్యతో పాటు వివేకం కలిగిన యువతకు ఆకాశమే హద్దుగా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. అణువులు, పరమాణువుల అంతరంగాన్ని అర్థం చేసుకున్న విద్యార్థులకు సైన్స్, టెక్నాలజీల్లో అభిరుచి పెరుగుతుందని చెప్పారు. మనసులో మెదిలిన ప్రతి ప్రశ్నకు సమాధానం దొరికే వరకు విశ్రమించరాదని, అనుమానాన్ని దాచుకుంటే అజ్ఞానం, నివృత్తి చేసుకుంటే జ్ఞానం పెరుగుతుందని వివరించారు. నమూనాలతో పలు అణువుల లక్షణాలను చూపించి, వాటిలో దాగిన అద్భుతాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వసంత వ్యాలీ పాఠశాల చైర్మన్ బుచ్చి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పై చదువులకు కావలసిన పునాదులను ఇక్కడే వేసుకోవాలని కోరారు. చురుకైన విద్యార్థులకు బహుమతులు అందజేసిన డాక్టర్ మధుసూదన్ రెడ్డిని పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది.

# కరీంనగర్ పోలీసు కమిషనరేట్‌లో "షీ లీడ్స్" శిక్షణ




**కరీంనగర్, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పోలీసు శాఖలో విధులు నిర్వహించే వారికి శారీరక ధృడత్వంతో పాటు మానసిక ధృడత్వం కూడా అత్యంత అవసరమని, "మనల్ని మనం రక్షించుకునే స్థితిలో ఉన్నప్పుడే ప్రజలను సమర్థవంతంగా రక్షించగలం" అని కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం పేర్కొన్నారు. ఈ నినాదానికి అనుగుణంగా, కమిషనరేట్ కేంద్రంలో సుమారు 100 మంది మహిళా పోలీసులకు (షీ టీమ్స్ సభ్యులతో సహా) రెండు దశల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే కఠినమైన విధుల్లో ఒత్తిడిని అధిగమించేందుకు, మానసిక ధృడత్వాన్ని పెంపొందించేందుకు ఈ శిక్షణ రూపొందించబడిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ మనస్తత్వవేత్త అడ్డిగ శ్రీనివాస్ మహిళా కానిస్టేబుళ్లకు ప్రత్యేక శిక్షణ అందించారు. ఆయన మాట్లాడుతూ, అవసరానికి మించి ఆలోచించడం, మన చేతుల్లో లేని అంశాలపై ఆందోళన చెందడం, గతాన్ని పదే పదే తలచుకోవడం వంటి కారణాల వల్ల మానసిక ఒత్తిడి పెరుగుతుందని తెలిపారు.

**ఒత్తిడిని అధిగమించడానికి ఆయన సూచించిన మార్గాలు:**
అవసరానికి మించి ఆలోచించకపోవడం
నియంత్రణలో లేని విషయాలపై ఆందోళన చెందకపోవడం
జరిగిన దానిని వాస్తవంగా అంగీకరించడం
ప్రస్తుతం చేస్తున్న పనిపై దృష్టి కేంద్రీకరించడం
ఈ మార్గాలను అనుసరించడం ద్వారా మానసిక ఒత్తిడిని సమర్థవంతంగా జయించవచ్చని శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్ పట్టివేత



**కరీంనగర్ రూరల్, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గ్రామాల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో మానకొండూర్‌కు చెందిన సయ్యద్ మీర్ తండ్రి అబ్జల్ అనుమతులు లేకుండా ఇసుకను కరీంనగర్ వైపు రవాణా చేస్తుండగా బొమ్మకల్‌లోని ఎస్ఎఫ్ఎస్ ఫంక్షన్ హాల్ వద్ద రూరల్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసి కోర్టుకు పంపించారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

# పోగొట్టుకున్న ఫోన్‌ను యజమానికి అప్పగించిన రూరల్ పోలీసులు




**కరీంనగర్ రూరల్, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నగురూరుకు చెందిన ఉరుసు నరసయ్య సెప్టెంబర్ 29న నగునూరులో తన వివో ఫోన్‌ను పోగొట్టుకొని రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ టెక్నాలజీ సహాయంతో ఆ ఫోన్ నిజామాబాద్‌లో ఉన్నదని గుర్తించి రికవరీ చేశారు. బుధవారం రూరల్ పిఎస్ ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి ఆ ఫోన్‌ను యజమాని నరసయ్యకు అప్పగించారు. ఫోన్ రికవరీలో కృషి చేసిన కానిస్టేబుల్ పద్మజ, విశ్వతేజను ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి అభినందించారు.

# సాండ్ బజార్ ద్వారా ఇసుక అక్రమ రవాణా నియంత్రణ



**మంచిర్యాల, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చెన్నూరు మండలం బావురావుపేటలో ఏర్పాటు చేసిన సాండ్ బజార్‌ను రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ చంద్రయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు సాండ్ బజార్ ఏర్పాటు చేశామని, అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమం ద్వారా గృహజ్యోతి, రాయితీ గ్యాస్, ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలను అమలు చేస్తోందని వివరించారు. చెన్నూర్ నియోజకవర్గంలో 250 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, కళాశాలలకు నిధులు, ఆసుపత్రి విస్తరణ, డయాలసిస్ ప్లాంట్, సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాండ్ బజార్ ద్వారా వినియోగదారులకు ప్రణాళికాబద్ధంగా ఇసుక అందిస్తామని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తున్నామని చెప్పారు. తరువాత కిష్టంపేట రైతు వేదికలో మహిళలకు చీరలు పంపిణీ చేసిన మంత్రి, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, విద్యార్థులకు ఏకరూప దుస్తుల తయారీ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

# మన్ననూర్‌లో ఘనంగా ఇందిరా గాంధీ జయంతి



**అమ్రాబాద్, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమ్రాబాద్ మండల మంగళూరు గ్రామంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఉక్కు మహిళగా ప్రపంచ దేశాలు కొనియాడిన ఇందిరా గాంధీ సేవలను స్మరించుకుంటూ పిల్లలకు సీట్లు పంపిణీ చేసి ఆనందం పంచుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంబు వెంకటరమణ మాట్లాడుతూ, ఇదే రోజున ఝాన్సీ లక్ష్మీబాయి కూడా జన్మించారని, ఒకే నక్షత్రంలో పుట్టిన ఇద్దరు వీరవనితలు దేశం కోసం ప్రాణత్యాగం చేశారని పేర్కొన్నారు. గరీబి హఠావో నినాదంతో పేదల కోసం 20 సూత్రాల పథకాలను అమలు చేసి ప్రజలకు మేలు చేసిన ఉక్కు మహిళగా ఇందిరా గాంధీ చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ వైయస్ ఎంపీపీ శంభో శోభ, ఉమామహేశ్వర దేవస్థానం పాలకమండలి సభ్యురాలు, మాజీ కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రహీం, జూలూరు సత్యనారాయణ, జాఫర్, శివాజీ, చంద్రయ్య, ఇస్మాయిల్, శంకరయ్య, రాజు జూమర్ల, రాజారాం నాయక్, సీనియర్ కార్యకర్త హసన్‌తో పాటు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ చీరల పంపిణీ

**- రీజినల్ రింగ్ రోడ్ భూ సేకరణపై కలెక్టర్ సూచనలు**




**సిద్దిపేట, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం జిల్లాలో పారదర్శకంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కే. హైమావతి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇచ్చిన దిశానిర్దేశాల మేరకు ప్రతి అర్హురాలికి చీరలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. నియోజకవర్గాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించి, ప్రజా ప్రతినిధుల సమక్షంలో నిర్ణీత గడువులో పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, సమాఖ్యలు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. తరువాత కలెక్టరేట్‌లో రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణంపై మర్కుక్, వర్గల్ మండలాల రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రజావసరాల కోసం భూమి కోల్పోతున్న వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, నష్టపరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. భూ సేకరణకు రైతులు సహకరించాలని ఆమె కోరారు.

# సూర్యాపేట బహిరంగ సభకు గోడ పోస్టర్ ఆవిష్కరణ



**హుస్నాబాద్ నియోజకవర్గం, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఈనెల 28వ తేదీన సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరగనున్న బహిరంగ సభకు సంబంధించి అక్కన్నపేట మండలం జనగాం గ్రామంలో గోడ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి సంవత్సరాలు గడిచినా గీతా కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాడిచెట్టు మీద నుండి పడి చనిపోయిన వారికి, వికలాంగులైన వారికి 30 కోట్ల రూపాయల ఎక్స్‌గ్రేషియా బకాయిలు ఇప్పటికీ విడుదల కాలేదని విమర్శించారు. గీతా కార్మికుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసి 1000 కోట్ల రూపాయలు నిధులు కేటాయిస్తామని, రాష్ట్రవ్యాప్తంగా బెల్టు షాపులను రద్దు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు కాలేదని పేర్కొన్నారు. కొత్త పెన్షన్ల జాడ లేకపోవడం, పాత పెన్షన్లు 2000 నుండి 4000 చేస్తామని ఇచ్చిన హామీ కూడా నెరవేరలేదని తెలిపారు. సేఫ్టీ మోకులు కేవలం మాటలకే పరిమితమై, గీతా కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో గీతన్నల రణభేరి కార్యక్రమాన్ని సూర్యాపేటలో ఎం.వి. రమణ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ కల్లుగీతా కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు, హుస్నాబాద్ పట్టణ ప్రధాన కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్, జనగాం గౌడ సంఘం అధ్యక్షులు పూదరి బిక్షపతి, పూదరి పెద్దన్న, పూదరి కనకయ్య, పూదరి రవీందర్, పూదరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



**హనుమకొండ, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా హనుమకొండలోని డిసిసి భవన్‌లో కాంగ్రెస్ నేతలు ఘనంగా నివాళులర్పించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరా గాంధీ ధైర్యానికి ప్రతీక, పేదల అభ్యున్నతికి ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన ఉక్కు మహిళ అని కొనియాడారు. తరువాత న్యూ శాయంపేట ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రూ.60 లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. గత పాలనలో పట్టించుకోని శాయంపేట డివిజన్‌ను గడిచిన రెండేళ్లలో అత్యధిక నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# యాసంగిలో స్వల్ప, మధ్యకాలిక విత్తనాలపై రైతులకు సూచనలు



**ఎలిగేడు, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నర్సాపూర్ గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించిన వ్యవసాయ పరిశోధన స్థానం కూనారం ప్రధాన శాస్త్రవేత్త సతీష్ చంద్ర యాసంగి పంటలో స్వల్పకాలిక, మధ్యకాలిక విత్తనాలను విత్తుకోవాలని సూచించారు. ఏప్రిల్ మే నెలల్లో రాళ్ల వర్షాలు దృష్టిలో ఉంచుకొని ఏప్రిల్ మొదటి వారం లోపల వరి కోతలు పూర్తిచేసేలా సిద్ధంగా ఉండాలని తెలిపారు. నారుమడి యాజమాన్య పద్ధతులు, సమగ్ర యాజమాన్య విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 10 మంది రైతులకు కేఎన్ఎమ్ 13555 విత్తనాల చిరు సంచులు పంపిణీ చేశారు. మండల వ్యవసాయ అధికారి ఎం. ఉమాపతి మాట్లాడుతూ విత్తన రకాలతో పాటు విత్తే సమయం కూడా కీలకమని, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండాలని సూచించారు. ఆయిల్ పామ్ పంటకు ప్రభుత్వం అధిక సబ్సిడీ ఇస్తోందని, ఈ యాసంగిలో రైతులు ఆయిల్ పామ్ పంటను సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎలిగేడు సింగిల్ విండో చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, శాస్త్రవేత్త అనిల్, ఏఈఓ గణేష్, ఫీల్డ్ ఆఫీసర్ అభిలాష్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి



**నాగర్‌కర్నూల్, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రంలో భారత తొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్థానిక నాయకులతో కలిసి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ మండలాలకు చెందిన మహిళలకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద 67 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఓట్ల సమయంలో మాత్రమే రాజకీయాలు చేయాలని, సంక్షేమ పథకాలు మాత్రం పార్టీలకు అతీతంగా అందాలని సూచించారు. గత ప్రభుత్వాలు చేయని పనులు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని, మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలన పై అవగాహన



**కడ్తాల్, నవంబర్ 19 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
: బాల్యవివాహాలు జరిపించిన, ప్రోత్సహించిన చట్టరీత్యా నేరమని కడ్తాల్ ఐసిడిఎస్ సూపర్వైజర్ కవిత హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు బాల్య వివాహాలు చేయకూడదని 18 సంవత్సరాల వయసు వచ్చేంతవరకు అమ్మాయిలకు వివాహం చేయకూడదని తెలిపారు. కడ్తాల్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో( నషా ముక్తి భారత్ అభియాన్) కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు బాల్యవివాహాలు, డ్రగ్స్ వల్ల జరిగే అనర్థాలు, తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలను అరికట్టడంలో అధికారులు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం ఎంతో అవసరం అన్నారు. 18 సంవత్సరాల వయస్సు నిండకముందు పెళ్లిళ్లు చేయడంతో సంసార జీవితాన్ని మోయలేక ఎన్నో అనర్థాలకు దారితీస్తుందన్నారు. బాలికలకు బలవంతంగా వివాహాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సూపర్వైజర్ కవిత హెచ్చరించారు. బాల్య వివాహాల నిర్మూలనకు టోల్ ఫ్రీ నెంబర్ 1098 కు ఫోన్ చేసి బాల్య వివాహాలు నిర్మూలించాలని తెలిపారు. అనంతరం డ్రగ్స్ పై జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్సై చంద్రశేఖర్, పాఠశాల ఎస్ఓ అనిత, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయురాలు తదితరులు ఉన్నారు.

# రెండు ఇంచులు కూడా లేని లాలపల్లి బీటీ రోడ్డు..

**అధికారుల పర్యవేక్షణ లేని పనులు**
**మాజీ ఎంపీపీ తానుపర్తి స్రవంతి మోహన్ రావు.**





**ఎలిగేడు,**
**నవంబర్ 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: మండలంలో రాత్రికి రాత్రి పంచాయతీ రాజ్ వారు వేసిన బీటీ రోడ్డు పూర్తిగా నాణ్యత లేకుండా ఉందని ఎలిగేడు మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి మోహన్ రావు ప్రజలు ఆగ్రం వ్యక్తం చేశారు. ఎలిగేడు మండలం లాలపల్లె నుండి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల వరకు గల బీటీ రోడ్డు నిర్మాణంలో పూర్తిగా నాణ్యత లేదని, అధికారుల పర్యవేక్షణ లేకుండా చేపట్టవలసిన అవసరం ఏమిటని వారు ప్రశ్నించారు. బుధవారం ఆయనతోపాటు గ్రామ టిఆర్ఎస్ నాయకులు కలసి రోడ్డును పరిశీలించగా రోడ్డు పూర్తిగా మట్టి మీద వేశారని క్రింద కనీసం కంకర కూడా లేదని కాలితో తొక్కుతే పూర్తిగా పగిలిపోతుందని, వేసిన బీటీ రోడ్డు కనీసం రెండు ఇంచులు కూడా లేదని ఇలాంటి నాసిరకం రోడ్డు నిర్మాణంలో ఎవరి పాలు ఎంతుందో అని అనుమాన వ్యక్తం చేశారు వేసిన రోడ్డు పనులను అధికారులు వెంటనే పరిశీలించి పోసిన రోడ్డు తొలగించి మంచి నాణ్యతతో రోడ్డు పోసేటట్లు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వ అధికారులను పత్రిక ముఖ్యంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టిఆర్ఎస్ నాయకులు నాతరి పోచాలు,కవ్వంపల్లి బాపయ్య, సిహెచ్ జగన్ ,బాసంపల్లి వినోద్ బత్తిని కిష్టయ్య, గంగయ్య, రాజు,పోచాలు ,గట్టు రాజు ,నరసయ్య తిరుపతి చెవుల అజయ్ ,సత్యం, సది నాయకులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కుల దురంకార హత్య హంతకులను ఉరితీయాలి

**-ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో ఆర్ డి ఓ కు వినతి పత్రం.**
**--పోలీసుల నిర్లక్ష్యం సర్కారు వైఫల్యం వల్లే రాజశేఖర్ హత్య.**




**దేవరకొండ నవంబర్ 19.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో కులోన్మాదులుగా వ్యవహరించిన కొందరు వ్యక్తులు అత్యంత అమానవీయంగా ఒక దళితుడిని హత్య చేయడం వెనుక ప్రభుత్వ వైఫల్యం.. పోలీసుల నిర్లక్ష్యం ప్రధాన పాత్ర పోషించారని ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు దాసరి లక్ష్మయ్య, ఉపాధ్యక్షులు డా.బుర్రి వెంకన్న అన్నారు, రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామంలో దళిత యువకుడు ఎర్ర రాజశేఖర్ ను అర్ధరాత్రి కిడ్నాప్ చేసి హత్యకు పాల్పడి అత్యంత దారుణంగా దహనం చేయడం ఘోరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నెలరోజుల క్రితమే ఈ కేసు వ్యవహారం పోలీసులు దృష్టిలో ఉందని కానీ బాధితుడి కుటుంబాన్నే టార్గెట్ చేసిన పోలీసులు వారిని బెదిరించడం, పెళ్లికి నిరాకరించడం జరిగిందని అన్నారు. వెంకటేష్(అమ్మాయి తండ్రి) మృతుడి ఇంటికి వెళ్లి రాజశేఖర్ ను బయటికి తీసుకు వెళ్లినప్పుడే అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసిందని, అయినప్పటికీ విచారణలో నిర్లక్ష్యం చేయడం వల్ల రాజశేఖర్ మరణించాడని పేర్కొన్నారు. తమ్ముడు ప్రేమకు సంబంధించి అన్నను ఒకవైపు పోలీసులు వేధించడం, మరోవైపు యువతి తండ్రి హత్యకు పాల్పడడం అత్యంత దారుణం అన్నారు.రాష్ట్రంలో కుల దురహంకార హత్యలు రోజురోజుకీ పెరుగుతున్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఆసిఫాబాద్లో శ్రావణి హత్య కూడా జరిగిందని, రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికి 142 కుల దురహంకార హత్యలు జరిగాయని అన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం గానీ, ముఖ్యమంత్రి గాని ఈ వ్యవహారంపై స్పందించకపోవడం దారుణం అన్నారు. ఇకనైనా దీనిపై శాసనసభలో చర్చించి కులాంతర వివాహాల కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా నిందితులను కఠినంగా శిక్షించకపోతే పోలీసు కార్యాలయాలను ముట్టడించడానికి కూడా వెనుకాడమని స్పష్టం చేశారు. రాజశేఖర్ కుటుంబానికి పోలీసులు రక్షణ కల్పించాలని అన్నారు. అదేవిధంగా వారి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజశేఖర్ భార్య కు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.పోలీసులు ఇకనైనా దళితులకు రక్షణ కల్పించకపోతే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రత్యేకంగా కులాంతర వివాహిత రక్షణ చట్టం కోసం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షులు కన్యపాక.గిరి శేపూరి రాజేష్. ఇరిగి లింగయ్య. కొండమల్లేపల్లి మండల కన్వీనర్ మేదరి ప్రసాద్ పీఏ పల్లి ఉపాధ్యక్షులు చేపూరి లక్ష్మయ్య అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సుబ్బారావు జన్మదినోత్సవం





**చౌటుప్పల్, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సీల్వెల్ కార్పొరేషన్ అధినేత బండారు సుబ్బారావు జన్మదినోత్సవాన్ని ఆయన పాలసీదారుడు కౌటికె విఠల్ అర్థవంతంగా జరిపారు. చౌటుప్పల్ సమీపంలోని శ్రీ పుణ్యలింగేశ్వర స్వామి దేవాలయం పక్కన ఉన్న అమ్మానాన్న అనాథ ఆశ్రమంలో 600 మంది నిర్భాగ్యులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి, వారి దీవెనలను సుబ్బారావుకు అంకితం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్ఐసీ చౌటుప్పల్ బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణ హాజరై రిబ్బన్ కటింగ్ చేసి అన్నప్రసాదాన్ని ప్రారంభించారు. స్థానిక జీవిత బీమా ఏజెంట్లు, లియాఫీ అధ్యక్షుడు సైదులు తదితరులు పాల్గొని విఠల్‌ను బొకేతో సత్కరించారు. దేవాలయం ఆశ్రమ చైర్మన్ గట్టు శంకర్ ఆశ్రమాన్ని దర్శించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అందరూ కలిసి సుబ్బారావుకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆరోగ్యంతో 100 సంవత్సరాలు జీవించాలని ఆశీర్వదించారు. దాదాపు 600 మంది నిర్భాగ్యులు తృప్తిగా భోజనం చేసిన ఈ సేవా కార్యక్రమం విశేష ప్రశంసలు పొందింది. ఆశ్రమ సిబ్బంది చూపిన సేవాభావం, క్రమశిక్షణ ప్రత్యేకంగా నిలిచింది. ఈ సందర్భంగా ఎల్ఐసీ మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ, "నా 40 ఏళ్ల సేవా చరిత్రలో పాలసీదారుడి జన్మదినాన్ని ఇలాగే అనాథలకు అన్నదానంగా జరుపుకోవడం ఎక్కడా చూడలేదు. ఇది ఇన్సూరెన్స్ రంగంలోనే తొలి ఘట్టం" అని అభినందించారు. విఠల్ సతీమణి కావ్య కూడా కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. విఠల్ మాట్లాడుతూ, "నా పాలసీదారులందరూ ఆరోగ్యంగా, అభివృద్ధి చెందాలని ప్రతిరోజూ ప్రార్థిస్తుంటాను. అధిక ప్రీమియం కలిగిన పాలసీదారుల జన్మదినోత్సవాలను సేవా కార్యక్రమాల రూపంలో జరపడం నాకు ఆనందాన్ని ఇస్తుంది. భవిష్యత్తులో వారు మరిన్ని పాలసీలు చేస్తూ మా సేవలకు తోడ్పడాలి" అని ఆశీర్వదించారు.

# ఊరి కోసం పనిచేస్తే రాజకీయం చేయడం ఏంటి..?

**చెరువు నీటిని కాపాడితే కుట్రలు చేస్తున్నారు**
**క్షమాపణలు, కేసులంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు**
**పది రోజుల తర్వాత రాజకీయరంగు పులిమి బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయాలని ప్రకటనలు ఇవ్వడం ఎంతవరకు సమంజసం..?**
**చెన్నారం చెరువు గండి పూడిక పనుల విమర్శలపై ఆవేదన వ్యక్తం చేస్తున్న చెన్నారం రైతులు**



**వర్ధన్నపేట, నవంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మొంథా తుఫాను ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని చెన్నారం ఊర చెరువు పూర్తిగా నిండుకుంది. భారీ వరదలతో చెరువు మత్తడి వద్ద గండి పడిన ఘటనలో గ్రామ రైతులు గండిని పూడ్చే ప్రయత్నంలో భాగంగా పక్కనే ఉన్న మూడు ఈత చెట్లను గండి పూడ్చే ప్రక్రియలో వాడటాన్ని కూడా రాజకీయం చేయడం రైతాంగాన్ని తీవ్ర మనస్థాపానికి గురిచేస్తుందని చెన్నారం రైతులు వాపోతున్నారు. చెరువు మత్తడి వద్ద పడిన గండిని సకాలంలో
పూడ్చక పోయుంటే..దాదాపు 100 ఎకరాల్లో పంట నష్టపోయే వాల్లమని..అప్పటికప్పుడు స్పందించి ఇసుక బస్తాలు,మట్టి పక్కనే ఉన్న చెట్టు చేమతో గండిని పూడ్చి వేసామని రైతులు తెలిపారు. ఈ ఘటనను ఆసరాగా చేసుకుని గ్రామంలోని కొందరు తమపై కక్షపూరితంగా గౌడ కులస్తులను రెచ్చగొట్టి ఉద్దేశపూర్వకంగానే మమ్మల్ని ఇబ్బందులు గురి చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ని రోజుల తర్వాత ఈ ఘటన రాజకీయ రంగు పులుముకుని మమ్మల్ని బీఆర్ఎస్ పార్టీకి ఆపాదిస్తూ.. బీఆర్ఎస్ పార్టీ నాయకులే అనవసరంగా చెట్లను తొలగించి గౌడ కులస్తులకు అన్యాయం చేశారనే విధంగా చిత్రీకరిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రకటనలు విడుదల చేయడం బాధాకరమని అన్నారు. మేము చేసిన పని ఏ ఒక్కరి స్వార్థానికో లేదా ఎవరినో ఇబ్బందులకు గురిచేయాలని చేయలేదని... కేవలం అప్పుడున్న ప్రమాదాన్ని నివారించాలని మాత్రమే గండి పూడ్చడం జరిగిందని వివరించారు. ఓ మంచి లక్ష్యంతో చేసిన పనిని ఇప్పటికైనా రాద్ధాంతం చేయకుండా.. రాజకీయాలు చేయడం మానాలని రైతులు హితవు పలికారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో చట్టపరమైన రిజర్వేషన్ కావాలి

**- సామాజికవేత్త. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్**



**దేవరకొండ నవంబర్ 19.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా, చందంపేట మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి బీసీ సంక్షేమ సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా సామాజికవేత్త. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందుకు మేనిఫెస్టోలో పెట్టినటువంటి 42 శాతం రిజర్వేషన్లను పార్టీ పరంగా కాకుండా చట్టబద్ధంగా వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ పరంగా రిజర్వేషన్లు కల్పిస్తే బీసీలకు న్యాయం కలుగ దని చట్టపరమైనటువంటి రిజర్వేషన్లకు కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని అఖిలపక్ష పార్టీల తోటి కేంద్రంలో ఉన్నటువంటి ప్రధానమంత్రి మోడీ వద్దకు వెళ్లి సమస్యను పరిష్కరించే దిశలో ముందుకెళ్లి నైన్త్ షెడ్యూల్లో చేర్చి శాశ్వత పరిష్కారం చూపాలని, అభివృద్ధి నిధుల పేరిట, బీసీలపై ఆలోచన లేకుండా మోసం చేయడం ఎన్నికలు జరపడం సమంజసం కాదని అన్నారు. లేనియెడల బీసీలు మీకు దూరమయ్యేటటువంటి అవకాశం ఉంటుందని ప్రభుత్వాన్ని కోరారు. అన్ని వర్గాలతో కలిసి ప్రభుత్వాన్ని స్తంభింపజేసి రిజర్వేషన్ సాధించుకునే దిశలో కార్యచరణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి యాదయ్య, కుంభం బాలచంద్ర గౌడ్, చిత్రియాల చిన్న రామచంద్రం ఏడుకొండ వెంకట్ నారాయణ, రెడ్డి శంకర్, రెడ్డి ఆంజనేయులు,, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి కాశయ్య,, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు గుద్దేటి నాగయ్య, కునమోని రామాంజనేయులు నేలపట్ల శేఖర్, బోడ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ జన్మదిన వేడుకలు




**దేవరకొండ నవంబర్ 19.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బీసీల ముద్దుబిడ్డ బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ జన్మదిన వేడుకలు బుధవారం దేవరకొండ పట్టణంలో బీసీ పొలిటికల్ యువజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు చింతపల్లి సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో, స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో బీసీ పొలిటికల్ యువజన జేఏసీ నియోజకవర్గం అధ్యక్షులు సాయిరాం కురుమ, బీసీ పొలిటికల్ విద్యార్థి జేఏసీ నియోజకవర్గ అధ్యక్షులు సురకారం సత్యం గౌడ్, బీసీ పొలిటికల్ జేఏసీ మండల అధ్యక్షులు బొడ్డుపల్లి సత్యం,యువజన జేఏసీ మండల అధ్యక్షులు ధనరాజ్ యాదవ్, నేరడుగమ్ము మండల అధ్యక్షులు హరీష్ యాదవ్, చందంపేట మండల అధ్యక్షులు పగిళ్ల శివప్రసాద్ స్వామి, దేవరకొండ పట్టణ అధ్యక్షులు గుండాల అంజి యాదవ్ స్వామి, కుంభం సిద్దు గౌడ్, సతీష్ స్వామి, చందు,తదితరులు పాల్గొన్నారు.

# యువతి యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి

**- కేవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను.**



**నిడమానూరు నవంబర్ 19.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ నిడమనూరు మండల మహాసభలు బుధవారం ముకుందాపురం లో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు మల్లికంటి చంద్రశేఖర్ అధ్యక్షత ననిర్వహించారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా ఈ మహాసభలకు కే వి పి ఎస్ జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీను హాజరై మాట్లాడుతూ డివైఎఫ్ఐ అందరికీ విద్యా ఉపాధి అవకాశాలు కల్పించాలని పోరాటాలు నిర్వహిస్తుంది. నిరుద్యోగం రోజు రోజుకు పెరుగుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలు కల్పించడం లేదు. దేశ జనాభాలో అధిక శాతం ఉన్న యువత నేడు ఉపాధి లేక జీవితాల మీద ఆశలు లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు కనుక ప్రభుత్వాలు రుణాలు ఇచ్చి యువతకు స్వయం ఉపాధి కల్పించాలి. కేంద్ర ప్రభుత్వం ఏట రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చింది కానీ ఇప్పటివరకు ఆ దిశగా అడుగులు వేయడం లేదు వెంటనే ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నిటిని భర్తీ చేయాలన్నారు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేసి యువతి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఉపాధి అవకాశాలు లేక చదువుకున్న యువకులు గుమస్తాలుగా, డ్రైవర్లుగా, మెకానికులుగా పనిచేస్తున్నారని, ఉపాధి అవకాశాలు లేక డ్రగ్స్ కి మద్యానికి బానిసలై ప్రాణాలు కోల్పోతున్నారని వారన్నారు. ఈనెల 20,21 వ తేదీలలో తిప్పర్తి మండల కేంద్రంలో నిర్వహించే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఈ మహాసభలో గతంలో నిర్వహించిన పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకుంటామని తెలిపారు. ఈ మహాసభలో మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు మండల అధ్యక్షులుగా వెంపటి మహేష్, కార్యదర్శిగా మల్లి కంటి చంద్రశేఖర్ ఉపాధ్యక్షులుగా కందుకూరు కోటేష్, శ్యామల రాజేష్, రొయ్య శ్రీను, నడ్డి నాగరాజు, సహాయ కార్యదర్శులుగా ఖమ్మంపాటి కోటేష్,లెంకలపల్లి పరిపూర్ణాచారి, కొండేటి నరేష్, సలికంటి కోటయ్య, మరో 7 గురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు . ఈ మహసభలో పాల్గొన్నవారు వ్యాకాస జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరు కోటేష్, సిఐటియు మండల నాయకులు ఇంజమూరి, శివ,డివైఎఫ్ఐ నాయకులు మాచర్ల కోటేష్ ధర్మారపు మధు వెంకటేష్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి



**ఆమనగల్లు, నవంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్ మాట్లాడుతూ, దేశ ప్రజలకు ప్రధానిగా ఇందిరాగాంధీ అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆమె 108వ జయంతి సందర్భంగా పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఘనంగా కార్యక్రమం జరిగింది. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, ఇందిరాగాంధీ చేపట్టిన సంస్కరణలు, పేదరిక నిర్మూలన కార్యక్రమాలు దేశానికి శాశ్వత స్ఫూర్తిగా నిలిచాయని పేర్కొన్నారు. ఆమె ఆలోచనలతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సుపరిపాలన అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, మాజీ మండల అధ్యక్షుడు మండ్లి రాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఖలీల్, మాజీ ఉప సర్పంచ్ దారెడ్డి అంజన్ రెడ్డి, సీనియర్ నాయకులు గాజుల సురేష్, ఖాదర్ ఖాద్రి, కాలే మల్లయ్య, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అబ్దుల్ కరీం, పులికంటి మైసయ్య, అబ్దుల్ అలీమ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, అలాగే దేవరశెట్టి మహేష్, నాజర్, కుమార్ గౌడ్, కండె సాయి, బద్ది వెంకటేష్, పూసలి వెంకటేష్, ఫెరోజ్, రఫీ, అంజాత్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని, భారతదేశ చరిత్రలో అజరామర నాయకురాలు

**-స్వర్గీయ ఇందిరాగాంధీ 108 జయంతి వేడుకలు.**
**-కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే బాలు నాయక్.**



**దేవరకొండ, నవంబర్19.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
మాజీ ప్రధాని, భారతదేశ చరిత్రలో అజరామర నాయకురాలు, స్వర్గీయ శ్రీమతి ఇందిరా గాంధీ 108వ జయంతిని పురస్కరించుకొని దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలునాయక్ ముఖ్య అతిథిగా హాజరై, ఇందిరాగాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ,ఇందిరా గాంధీ భారతదేశాన్ని శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. పేదల సంక్షేమం, వ్యవసాయ విప్లవం, హరిత విప్లవం, బ్యాంకుల జాతీయాకరణ వంటి అనేక చారిత్రక నిర్ణయాలతో దేశ అభివృద్ధికి మార్గదర్శకులయ్యాయని ఆయన గుర్తు చేశారు. పేద ప్రజల పట్ల ఆమెకున్న అంకితభావం, ధైర్యసాహసాలు నేటికీ ప్రతి నాయకుడికి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. అలాగే, గ్రామీణ అభివృద్ధి, మహిళా సాధికారత, జాతీయ భద్రత వంటి అంశాల్లో ఇందిరాగాంధీ చూపిన దూరదృష్టి దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులకు 12శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

**ఢిల్లీలో మారో నంగరా జాగో బంజారా అల్ ఇండియా గిరిజన కమిటీ కార్యక్రమం**



**కద్తాల్, నవంబర్ 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఢిల్లీలో మారో నంగరా జాగో బంజారా అల్ ఇండియా గిరిజన కమిటీ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి రవీందర్ నాయక్ ,గిరిజన రాష్ట్ర సేవ సంఘము అధ్యక్షులు హన్మ నాయక్ ,సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి జర్పుల లక్పతి నాయక్ ,సేవాలాల్ సేన వర్కింగ్ ప్రెసిడెంట్ రఘు రామ్ రాథోడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం లక్పతి నాయక్ మాట్లాడుతూ..గల్లీ నుంచి ఢిల్లీ దాకా గిరిజనుల 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో ఇందిరా గాంధీ సమాధి వద్ద మాజీ మొట్టమొదటి ప్రధానమంత్రి వర్యులు మరియు తెలంగాణ గిరిజన లంబాడా/బంజారాల రిజర్వేషన్ దాత ఇందిరా గాంధీ కి జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన రాష్ట్ర నాయకులు బిచ్యా నాయక్,సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు, ఏఎంసీ డైరెక్టర్ నరేష్ నాయక్,సేవాలాల్ సేన జిల్లా నాయకులు పత్య నాయక్, మాజీ సర్పంచులు రాములు నాయక్,పాండు నాయక్,పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యా నాయక్, ఉప్ప సర్పంచ్ పాండు నాయక్,శంకర్ నాయక్,లచ్చిరాం, రాజేందర్, రాజు, రాజకుమార్, శ్రీను,భీమన్, పవన్,జగన్, సక్రూ, నాయకులు,యువకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నేతాజీ సేవాసమితి ప్రథమ వార్షికోత్సవం-ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు



**డోర్నకల్, నవంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో నవంబర్ 19, 2025న ఝాన్సీ లక్ష్మీబాయి 197వ జయంతి సందర్భంగా నేతాజీ సేవాసమితి ప్రథమ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు మంజుల, శ్రీదేవి, సరిత, ఎలిజబెత్, అక్సా లకు సన్మానం చేసి, 14 మంది బాలికలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. నేతాజీ సేవాసమితి వ్యవస్థాపకుడు డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ ఝాన్సీ లక్ష్మీబాయి అసలు పేరు మణికర్ణిక అని, 1828 నవంబర్ 19న వారణాసిలో జన్మించారని, ఝాన్సీ రాజు గంగాధర్ రావుతో వివాహం అనంతరం లక్ష్మీబాయి గా ప్రసిద్ధి చెందారని వివరించారు. 1857 సిపాయిల తిరుగుబాటులో ఆమె పోరాటం బ్రిటిష్ వారిని గడగడలాడించిందని, ఆమె వీరత్వం అనేక మహిళలకు ఆదర్శప్రాయం అని పేర్కొన్నారు. మహిళలు లక్ష్మీబాయి గారిని ఆదర్శంగా తీసుకొని ధైర్యం, సాహసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డోర్నకల్ పట్టణ కౌన్సిలర్ మౌనిక జైన్ మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో ముందుండి దేశ సేవలో తమ వంతు కృషి చేయాలని, ధైర్యం, సాహసం, సేవ లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేతాజీ సేవాసమితి ప్రధాన కార్యదర్శి కుదురుపాక వివేక్, ఉప కార్యదర్శి కుర్యావుల గంగాధర్ గౌడ్, ప్రముఖ వ్యాపారవేత్త సునీల్ పాట్ని, సరళ జైన్, భవిత జైన్, మమతా జైన్, భారతి జైన్ తో పాటు సుమారు వందమంది బాలికలు పాల్గొన్నారు.



## కాజల్ గ్లామర్ సెన్సేషన్..







# ఏడాదిన్నర తర్వాత.. థియేటర్లలోకి అనుపమ పరమేశ్వరన్ 'లాక్‌డౌన్'

ఈ ఏడాది బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ప్రేక్షకులను పలుకరించింది అనుపమ పరమేశ్వరన్. 2025లో డ్రాగన్, పరదా, కిష్కింధపురి, జేఎస్‌కే.. జానకి వీ వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ, ది పెట్ డిటెక్టివ్, బైసన్ సినిమాలతో మంచి హిట్స్ అందుకుంది. అనుపమ పరమేశ్వరన్ నటించిన తమిళ చిత్రం లాక్‌డౌన్ .ఏఆర్ జీవా డైరెక్ట్ చేసిన ఈ మూవీ 2024 జూన్‌లో ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా.. పలు కారణాలతో వాయిదా పడ్డది. ఫైనల్‌గా ఈ చిత్రం విడుదలకు రెడీ అయింది. మేకర్స్ కొత్త విడుదల తేదీని ప్రకటించారు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 5న విడుదల చేస్తున్నట్టు తెలియజేస్తూ కొత్త లుక్ షేర్ చేశారు. అనుపమ పరమేశ్వరన్ చీకటి గదిలో దిగాలుగా పడుకున్న స్టిల్‌తోపాటు ఏదో తెలియని బాధలో, ఆలోచనలో ఉన్నట్టుగా ఉన్న లుక్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి.లైకా ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ చిత్రానికి కేఏ శక్తివేళ్ సినిమాటోగ్రఫర్. చార్లీ, నిరోషా, ప్రియా వెంకట్, లివింగ్ స్టన్, ఇందుమతి, రాజ్‌కుమార్, షాష్మి, లొల్లు సభా మారన్, వినాయక్ రాజ్, విధు, అభిరామి, రేవతి, సంజీవీ, ప్రియా గణేశ్, ఆశ ఇతర కీలక పాత్రల్లో నటించారు. లాంగ్ గ్యాప్ తర్వాత వస్తున్న ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి ఎలాంటి స్పందన వస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# హైప్ పెంచుతోన్న కార్తీ నయా లుక్

## వా వాతియార్ తెలుగు టైటిల్ ఇదే..



తమిళంతోపాటు తెలుగులో కూడా మంచి ఫ్యాన్ బేస్ ఉన్న కోలీవుడ్ స్టార్ యాక్టర్లలో ఒకడు కార్తీ. ఈ టాలెంటెడ్ యాక్టర్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం వా వాతియార్. నలన్ కుమారస్వామి దర్శకత్వం వహిస్తున్నాడు. ఉప్పెన ఫేం కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా.. సత్యరాజ్, రాజ్‌కిరణ్, జీఎం సుందర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఈ చిత్రాన్ని డిసెంబర్‌లో తమిళంతోపాటు తెలుగులో కూడా విడుదల చేయనుండగా.. విడుదల తేదీపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక కార్తీ సినిమాలకు తెలుగులో కూడా మంచి మార్కెట్ ఉంటుందని తెలిసిందే. తాజాగా చిత్ర నిర్మాణ సంస్థ స్టూడియో గ్రీన్ తెలుగు టైటిల్‌ను ఫిక్స్ చేసింది. ఈ చిత్రం తెలుగులో అన్నగారు వస్తారు టైటిల్‌తో రిలీజ్ కానుంది. కార్తీ ఖాకీ చొక్కాలో స్టైలిష్ రెడ్ గాగుల్స్ పెట్టుకుని డిఫరెంట్ లుక్‌లో కనిపిస్తున్న పోస్టర్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.అన్నగారు వస్తారు చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. కార్తీ కెరీర్‌లో వన్ ఆఫ్ ది సూపర్ హిట్‌గా నిలిచిన ఆవారా చిత్రం నవంబర్ 22న తెలుగులో రీరిలీజ్ కాబోతుందని తెలిసిందే.




# వారణాసి నుంచి రణకుంభ పాట విడుదల

దిగ్గజ దర్శకుడు రాజమౌళి, మహేశ్ బాబు కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం వారణాసి. ఈ సినిమాకు కేఎల్ నారాయణ నిర్మాతగా వ్యవవహరిస్తుండగా ఎంఎం కీరవాణి సంగీత అందించబోతున్నాడు. ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుండగా.. పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా కుంభ అనే పాత్రలో కనిపించబోతున్నాడు. అయితే ఇటీవలే ఈ మూవీ గ్లోబ్ ట్రాటర్ పేరుతో ఈవెంట్‌ను జరుపుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఇందులో పాడిన పృథ్వీరాజ్‌కి సంబంధించిన 'రణ కుంభ' పాటను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. 'ప్రళయం ప్రళయం' అంటూ సాగే ఈ పాట గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. 'వారణాసి' సినిమాకు సంబంధించి ఇటీవలే రామోజీ ఫిల్మ్ సిటీలో గ్లోబ్ ట్రాటర్ అనే పేరుతో ఈవెంట్‌ను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ వేడుక మొదట ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో మాత్రమే స్ట్రీమింగ్ అయ్యింది. అయితే తాజాగా ఈ వేడుకకు సంబంధించిన మొత్తం వీడియోను చిత్రబృందం యూట్యూబ్ వేదికగా వదిలింది. గంట 37 నిమిషాల నిడివి కలిగిన ఈ వీడియో ప్రస్తుతం డిజిటల్ వేదికగా వైరల్‌గా మారింది. కాగా ఈ వేడుకకు సంబంధించిన వీడియోకు వీక్షకుల సంఖ్య కూడా పెరుగుతోంది.

# వైరల్ వయ్యారికి లేడీ సూపర్‌స్టార్ సలహాలు..

## ఇంకా హిట్ పక్కనా ??

ఈ మధ్య నయన్ అండ్ శ్రీలీలను ఒకట్రెండు చోట్ల కలిపి చూసిన వాళ్లందరూ వాళ్లల్లో ఉన్న కామన్ క్వాలిటీస్‌ని పిక్ చేసే పనుల్లో ఉన్నారు. ఇద్దరినీ కలిపిన విషయం ఏమై ఉంటుందా? అని ఆలోచనలో పడుతున్నారు. శ్రీలీలకు నయన్ గైడెన్స్ ఇస్తున్నారా? అని కూడా మాట్లాడుకుంటున్నారు. వైరల్ వయ్యారి అనిపించుకున్న యూత్ ఐకాన్ శ్రీలీల. ఇప్పుడు తెలుగులోనే కాదు, బ్యాక్ టు బ్యాక్ కోలీవుడ్, బాలీవుడ్ సినిమాలతోనూ బిజీ అవుతున్నారు. ఎంత బిజీగా ఉన్నప్పటికీ కొత్త పరిచయాలతో ఎప్పటికప్పుడు ఫ్యాన్స్ ని మెస్మరైజ్ చేస్తూనే ఉన్నారు కిస్సిక్ బ్యూటీ. తాజాగా నయనతారతో కలిసి కనిపిస్తున్నారు శ్రీలీల. యాదృచ్ఛికంగా జరిగినా, ప్లాన్ ప్రకారమే కలిసి ట్రావెల్ చేసినా.. వీళ్లిద్దరి మధ్య ఉన్న భక్తిని కామన్ పాయింట్‌గా చెప్పుకుంటున్నారు జనాలు. అంతే కాదు, నయన్ అండ్ శ్రీలీల.. ఇద్దరూ ఇప్పుడు లేడీ డైరక్టర్లతో పనిచేస్తున్న విషయాన్ని కూడా గుర్తుచేసుకుంటున్నారు. టాక్సిక్‌తో మలయాళీ లేడీ గీతూ మోహన్‌దాస్ కెప్టెన్సీకి నయన్ ఓకే చెబితే, పరాశక్తితో సుధా కొంగరకు శ్రీలీల ఓకే చెప్పేశారన్నమాట. ఇలా కామన్ క్వాలిటీస్ ఇంకేమైనా గుర్తుకొస్తే షేర్ చేసుకుందాం అంటూ సరదాగా చర్చ షురూ చేశారు నెటిజన్లు.



# 24ఏళ్లు పూర్తి చేసుకున్న అమృతం సీరియల్




తెలుగు టీవీ చరిత్రలో సువర్ణాధ్యాయంగా నిలిచిన కామెడీ సిట్‌కామ్ 'అమృతం' ప్రసారమై 24 ఏండ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో అభిమానులు, సినీ ప్రముఖులు ఈ సీరియల్ జ్ఞాపకాలను పంచుకుంటూ పోస్టులతో సందడి చేస్తున్నారు. 2001 నవంబర్ 18న జెమిని టీవీలో ప్రారంభమైన ఈ సిట్‌కామ్ 2007 నవంబర్ 18 వరకు విజయవంతంగా ప్రసారమైంది. ఆరు సంవత్సరాలలో దాదాపు 313 ఎపిసోడ్‌లతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించింది. 'అమృతం' కేవలం కామెడీ సీరియల్ మాత్రమే కాదు మధ్య తరగతి జీవితంలోని సమస్యలు, ఆశలు, నిరాశలను హాస్యం రూపంలో అద్దం పట్టించింది. ప్రముఖ నిర్మాత, రచయిత గుణ్ణం గంగరాజు ఈ హాస్య ధారావాహికను సృష్టించి, నిర్మించగా.. అమృతం పాత్రలో శివాజీ రాజా, నరేష్, హర్షవర్ధన్ కాలానికి అనుగుణంగా నటించారు. అంజి పాత్రలో గుండు హనుమంతురావు నటించగా.. సర్వం పాత్రలో వాసు ఇంటూరి, అప్పాజీ పాత్రలో శివన్నారాయణ నరిపెద్ది నటించి మెప్పించారు.